PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 60 | విజయవాడ, మంగళవారం 30 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 30 September 2025 | Rs

కుల వివక్షకు వ్యతిరేకంగా పాఠాలను చేర్చండి
- ఎన్‌సిఇఆర్‌టికి అలహాబాద్ హైకోర్టు ఆదేశం

7

8 లో

టీమిండియాకు తొలి పరీక్ష
నేడు శ్రీలంకతో అమీతుమీ • ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

బల్క్ డ్రగ్ పార్కుకు బ్రేక్

- సమస్య పరిష్కారమయ్యేవరకు పనులు ఆపండి : హోంశాఖ మంత్రి అనిత
- మత్స్యకారుల పోరాటంతో ఆదేశాలు జారీ • సిఎం, డిప్యూటీ సిఎం వద్దకు అఖిలపక్షం
- పూర్తిగా రద్దు చేసేంతవరకు దీక్షలు కొనసాగిస్తాం : మత్స్యకారుల ప్రకటన

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. పనులను తాత్కాలికంగా ఆపివేసింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రకటించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పనులను ఆపాలని ఆదేశించినట్లు అనిత తెలిపారు. అయితే, మత్స్యకారులు మాత్రం బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని, అంత వరకు తమ నిరాహార దీక్షలు కొనసాగుతాయని ప్రకటించారు. అంతకుముందు మత్స్యకారులు నిర్వహిస్తున్న నిరాహారదీక్ష శిబిరం వద్దకు హోంశాఖ మంత్రి అనిత వెళ్లారు. మత్స్యకార నాయకులు, రాజకీయ పార్టీల నేతలు బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు వల్ల జరిగే నష్టాన్ని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారుల ఉపాధి, ఉనికిని దెబ్బతీసే దీనిని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. హోంమంత్రి మాట్లాడుతూ, రాజయ్యపేట గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులు కమిటీగా ఏర్పడితే, వారందరినీ దసరా వెళ్లిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దగ్గరకు తీసుకెళ్తానని హామీ ఇచ్చి బయలుదేరుతుండగా, మత్స్యకారులంతా ఒక్కసారిగా ఆమె కాన్వాయ్‌ను అడ్డగించారు. బల్క్ డ్రగ్ పార్కు నిలుపుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో మంత్రి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు తలపెట్టాయని, తాను మాట ఇవ్వడానికి అవకాశం లేదని చెప్పారు. ఈ సమాధానంతో ఆగ్రహించిన మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై తాటి చెట్లను అడ్డుగా పెట్టి, బైఠాయించారు. పోలీసులు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ, మత్స్యకారులు ఎదురు తిరిగారు. తమ ఉనికిని, ఉపాధిని దెబ్బతీసే బల్క్‌డ్రగ్ పార్క్‌ను పూర్తిగా రద్దు చేస్తామన్న హామీ ఇచ్చేవరకు కదలనివ్వబోమని ప్రకటించారు. గతంలో హెటిరో డ్రగ్స్ పైప్‌లైన్ వేసే సందర్భంలో తామంతా చేపట్టిన ఆందోళనలో పాల్గొని కంపెనీకి వ్యతిరేకంగా అనిత మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. మత్స్యకారులకు చేపల వేట తప్ప, మరే వృత్తి రాదని, మిగతా 2లో

ఐదు దశల్లో తెలంగాణ 'స్థానిక' ఎన్నికలు
- షెడ్యూల్ ప్రకటన
- మూడు విడతల్లో పంచాయతీ
- రెండు విడతల్లో ఎంపిటిసి, జడ్‌పిటిసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. ఎంపిటిసి, జడ్‌పిటిసి, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని సోమవారం వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపిటిసి, జడ్‌పిటిసి.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో 5,749 ఎంపిటిసి, 565 జడ్‌పిటిసి స్థానాలకు, 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కమిషనర్ వివరించారు. ఎంపిటిసి, జడ్‌పిటిసిలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ నాలుగన, మూడో విడత నవంబర్ ఎనిమిదిన నిర్వహిస్తారు. పోలింగ్ పూర్తయిన అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపిటిసి, జడ్‌పిటిసి ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఇసి తెలిపారు. తొలివిడత ఎన్నికలు జరిగే ఎంపిటిసి, జడ్‌పిటిసిల్లో అక్టోబర్ తొమ్మిది నుంచి 11 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 23న ఎన్నికలు నిర్వహించి నవంబర్ 11న ఓట్లు లెక్కిస్తారు. రెండోవిడత ఎన్నికలు జరిగే ఎంపిటిసి, జడ్‌పిటిసిల్లో అక్టోబర్ 13 నుంచి 15వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 27న ఎన్నికలు నిర్వహించి నవంబర్ 11న ఓట్లు లెక్కిస్తారు. తొలి విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీలకు అక్టోబర్ 17 నుంచి 19 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 31న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. రెండో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబర్ నాలుగున ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు అక్టోబర్ 25 నుంచి 27 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబర్ 8న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

ప్రాథమిక హక్కులను హరించొద్దు

ఎస్ఐఆర్‌పై కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

తిరువనంతపురం : ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే చర్యలను నివారించాలని, ఓటర్ల జాబితాలను పారదర్శక పద్ధతిలో నవీకరించాలని కేరళ శాసనసభ ఏకగ్రీవంగా ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఈ తీర్మానాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం ఆధారంగా పౌరసత్వం ఇస్తున్న పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను పునరుద్ధరించడానికి ఎస్ఐఆర్‌ను ఉపయోగిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి ఒక సవాల్ అని ఆయన పేర్కొన్నారు. 'నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)ని అమలు చేయడానికి ఒక పరోక్ష మార్గంగా కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్)ని ప్రవేశపెడుతోందని విస్తృత ఆందోళన ఉంది. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఇటువంటి ఆందోళనలను ధ్రువీకరిస్తోంది. బీహార్ ఓటర్ల జాబితా నుంచి ఎటువంటి హేతుబద్ధత లేకుండా అనేక మందిని తొలగించారు. అదే పద్ధతి జాతీయ స్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా చేసుకున్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగ బద్ధంగా చెల్లుబాటవుతుందా అనే అంశం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉండగానే, త్వరలో ఎన్నికలు జరగనున్న కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అమలు చేయడానికి తొందరపడటాన్ని అమాయకపు చర్యగా గుర్తించలేమని' ఆ తీర్మానం పేర్కొంది. దీర్ఘకాలిక సన్నద్ధత, సంప్రదింపులు అవసరమయ్యే ఎస్ఐఆర్ వంటి ప్రక్రియను ఇలా తొందరపాటుగా ఎన్నికల సంఘం అమలు చేయడం ప్రజాస్వామ్య విలువలను హరించడమేనని తెలిపింది. కేరళలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు, 2026లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పరిస్థితిలో ఎస్ఐఆర్‌ను అమలు చేయాలన్న ఇసి ఎత్తుగడ దురుద్దేశంతో కూడుకున్నదని విమర్శించింది. 2002లో రాష్ట్రంలో చివరిసారిగా ఎస్ఐఆర్ నిర్వహించినప్పుడు రూపొందించిన ఓటర్ల జాబితాలను ప్రస్తుత ఎస్ఐఆర్‌కు ఆధారపత్రంగా వినియోగించాలనే ప్రణాళిక అశాస్త్రీయమైనదని పేర్కొంది. 1987 తర్వాత పుట్టిన వారు ఓటర్లుగా నమోదు కావడానికి తండ్రి లేదా తల్లి పౌరసత్వ పత్రాలను అందజేయవలసి ఉంటుందని సర్ నిర్దేశిస్తుందని, ఇది సార్వత్రిక వయోజన ఓటుహక్కుకు విఘాతం కలిగించే చర్య అని తెలిపింది. 2003 తర్వాత పుట్టిన వారు ఓటర్లు కావడానికి తల్లిదండ్రులిద్దరి పౌరసత్వ పత్రాలను సమర్పించవలసి ఉంటుందనే నిబంధన ఉంది. పత్రాలు లేని కారణంగా వ్యక్తులను ఓటర్ల జాబితా నుంచి మినహాయించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 కింద పౌరులకు హామీ ఇవ్వబడిన సార్వత్రిక ఓటు హక్కును పూర్తిగా ఉల్లంఘించడమే. ఈ రంగంలోని నిపుణుల అధ్యయనాలు ఎస్ఐఆర్‌లో ఇటువంటి నిబంధనలు సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు ఓటు హక్కును దూరం చేసే అవకాశముందని సూచిస్తున్నాయి. మినహాయించబడిన వారిలో ఎక్కువ మంది మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మహిళలు, పేద కుటుంబాల సభ్యులు. ప్రస్తుతం ఎన్నికల జాబితాలో ఉన్న ఓటర్ల హక్కులను రక్షించాలని' ఆ తీర్మానంలో కోరారు. ఈ తీర్మానాన్ని పాలక ఎల్‌డిఎఫ్, ప్రతిపక్ష యుడిఎఫ్ ఏకగ్రీవంగా ఆమోదించాయి.

ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి ఎప్పుడు?
- కేంద్రం తీరును నిరసిస్తూ పంజాబ్ అసెంబ్లీ తీర్మానం

7 లో

దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన సిఎం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సిఎం చంద్రబాబు దంపతులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడ కనక దుర్గమ్మకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు సోమవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. దసరా ఉత్సవాల సందర్భంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆనవాయితీగా పట్టు వస్త్రాలను సమర్పించారు. సిఎం దంపతులకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కొల్లు రవీంద్ర, ఎంపి కేశినేని శివనాథ్, ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ శీనా నాయక్ తదితరులు స్వాగతం పలికారు. దుర్గమ్మ దర్శనం అనంతరం వేదపండితులు ప్రసాదాలు అందజేశారు.

రూ.71 కోట్లతో దుర్గగుడి పనులు

అనంతరం మీడియా పాయింట్ వద్ద సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో సాధారణ ప్రజలకు ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. రూ.71.50 కోట్లతో ఇంద్రకీలాద్రిపై వివిధ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ.25 కోట్లతో నిర్మిస్తున్న అన్నప్రసాద భవనం ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు.

రూ.27 కోట్లతో మూడు నెలల్లో కొత్తగా ప్రసాదం తయారీ కేంద్రాన్ని పూర్తి చేస్తామన్నారు. రూ.5.5 కోట్లతో పూజా మండపం నిర్మిస్తున్నామని, రూ.14 కోట్లతో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్‌ను ఐదు నెలల్లో పూర్తవుతుందన్నారు. దుర్గమ్మ దయతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని, ప్రాజెక్టులన్నీ జలకళతో ఉన్నాయని అన్నారు.

ఎంపి మిథున్‌రెడ్డికి బెయిల్
- రాజమహేంద్రవరం జైలు నుంచి విడుదల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

లిక్కర్ స్కాం కేసులో నిందితుడిగా ఉన్న వైసిపి ఎంపి మిథున్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్‌ను విజయవాడ ఎసిబి కోర్టు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. ఈ కేసులో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో 71 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా సెప్టెంబరు 6న ఎసిబి కోర్టు ఐదు రోజుల పాటు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. గడువు ముగిసిన వెంటనే ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులో లొంగిపోయారు. బెయిల్ షరతుల్లో భాగంగా వారంలో రెండు రోజులపాటు సిట్ విచారణకు హాజరుకావడంతో పాటు, రెండు ష్యూరిటీలు, రూ.2 లక్షల పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని, సహనిందితులతో కేసు గురించి మాట్లాడరాదని, వాట్సాప్ నెంబరు, ఆధార్, ఇ-మెయిల్ ఐడి వివరాలు పోలీసులకు అందించాలని షరతుల్లో పేర్కొంది. దీంతో ఆయన సోమవారం సాయంత్రం 6 గంటలకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆయనకు వైసిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి.

తగ్గని కృష్ణమ్మ ఉధృతి

- శ్రీశైలానికి ఆరు లక్షల క్యూసెక్కులు
- నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద
- లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : విపత్తు సంస్థ

గుంటూరు జిల్లా దుగ్గిరాలలో నీట మునిగిన పసుపు పంట

ప్రజాశక్తి - యంత్రాంగం

కృష్ణమ్మ ఉధృతి కొనసాగుతుంది. ఎగువ జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి వరద కొనసాగుతుండడంతో శ్రీశైలానికి 6,00,363 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో బ్యారేజీ పది గేట్లను 23 అడుగుల మేర ఎత్తి 5,22,040 క్యూసెక్కులను దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 5.92 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువసాగర్‌కు విడుదల చేస్తున్నారు. పులిచింతల, నాగార్జున సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి 6,86,074 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ఇక్కడ రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. బ్యారేజీకి చెందిన 69 గేట్లను ఎత్తి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఏడు లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్, నాలుగు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. పర్యాటకశాఖ బోట్లను తాళ్లతో కట్టేశారు. కృష్ణా నది పరీవాహక లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు.

రాజధానికి వరద తాకిడి

గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలకు వరద నీరు చేరింది. తుళ్లూరు, కొల్లిపర మండలాల్లోని లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. కొల్లిపర, దుగ్గిరాల తుళ్లూరు, తాడేపల్లి మండలాల్లో 12 వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. కంద, అరటి, పసుపు, కూరగాయల తోటలు నీట మునిగాయి. దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు నీట మునిగినట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లా దాచేపల్లి, అమరావతి, అచ్చంపేట, మాచవరం మండలాల్లో పది వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. కృష్ణాతీరంలోని ఎనిమిది మండలాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాలో1087 హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టం

కృష్ణాలో 1634 మంది రైతులకు సంబంధించిన 2174 ఎకరాలు ఉద్యానవన పంటలు నీట మునిగాయి. కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లోని అరటి, కంద, బొప్పాయి, తమలపాకులు, కూరగా యలు, మల్బరీ తదితర పంటలు ముంపుకు గురయ్యాయి.

భారతీయ చిత్రాలకు ట్రంప్ షాక్
- వంద శాతం సుంకాలు
- మోడీ జోక్యం చేసుకోవాలి : సినీ పరిశ్రమ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భారత ఎగుమతులపై 50శాతం సుంకాలు, ఫార్మాపై 100 శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా మరో నిర్ణయం తీసుకు న్నారు. దాంతో భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం పడనున్నది. అమెరికా వెలుపల నిర్మించే సినిమా లపై వందశాతం సుంకాలను విధించనున్నట్టు ప్రకటిం చారు. విదేశీ సినిమాలపై వందశాతం సుంకాలు అమలు కాను న్నాయి. 'మా సినిమా నిర్మాణ వ్యాపారాన్ని అమెరికా నుంచి.. ఓ శిశువు నుంచి మిఠాయిని లాక్కున్నట్టుగా ఇతర దేశాలు దొంగిలించాయని ఆయన ఆరోపించారు. బలహీనమైన, అసమర్థ గవర్నర్‌తో ఉన్న కాలిఫోర్నియా ముఖ్యంగా తీవ్రంగా దెబ్బతింది అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఈ దీర్ఘకాల, ఎప్పటికీ అంతం కాని సమస్యను పరిష్కరించడానికి తాను అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై వంద శాతం సుంకం విధించనున్నట్టు పేర్కొన్నారు. విదేశీ సినిమాలతో అమెరికన్ సినిమా పరిశ్రమకు 'జాతీయ ముప్పు'గా ట్రంప్ పేర్కొంటూ ఈ ప్రకటన చేశారు.

ట్రూ డౌన్ - అసలు నిజాలు

బి.తులసీదాస్

'ఆరు మాసాలు చెలిమి చేస్తే వారు వీరవుతారు, వీరు వారవుతారన్నది' ఓ నానుడి. ఆదివారంనాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారి పార్టీ నాయకులతో జరిగిన టెలి కాన్ఫరెన్సులో విద్యుత్ ట్రూడౌన్ గురించి చెప్పిన విషయాలు పరిశీలిస్తే అసత్యాలు, అర్ధ సత్యాలతో ప్రజలను తప్పుదారి పట్టించే బిజెపి విద్యను టిడిపి కూడా ఒంటపట్టించుకున్నట్టు విదితమవుతోంది. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్, ట్రూ డౌన్ తదితర విషయాల్లో జరిగిందేమిటి, వాటి గురించి ప్రభుత్వ పెద్దలు చెబుతున్నదేమిటో ఒకసారి చూద్దాం.

రాష్ట్రంలోని మూడు డిస్కాములు విద్యుత్ వినియోగదార్ల నుండి 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌పిపిసిఎ పేరిట ప్రతి నెలా యూనిట్ విద్యుత్‌కు 40 పైసల చొప్పున మొత్తం రూ.2,787 కోట్లు వసూలు చేశారు. కానీ ఏడాది పూర్తయ్యాక తాము వసూలు చేసిన సొమ్ము ఖర్చులకు చాలలేదనీ, వినియోగదార్లపై ట్రూఅప్ ఛార్జీలుగా రూ.349 కోట్లు విధించాలని సిపిడిసిఎల్, రూ.493 కోట్లు భారం వెయ్యాలని ఎస్‌పిడిసిఎల్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఎపిఇఆర్‌సి) కి దరఖాస్తు చేశాయి. కాగా తాము వసూలు చేసిన సొమ్ము కన్నా రూ1,292 కోట్లు తక్కువ ఖర్చయినందున దాన్ని ట్రూడౌన్ కింద వినియోగదార్లకు తిరిగి చెల్లించాలని ఇపిడిసిఎల్ కోరింది. ఎపిఇఆర్‌సి ఈ విషయాలను 2025 జులై 9న పత్రికల్లో ప్రకటించి, అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలపమని కోరింది. అన్ని పరిశీలనల అనంతరం 2027 సెప్టెంబర్ 27న మూడు డిస్కాముల మొత్తాన్నీ కలిపి వారు తెలిపినట్లు అదనపు ఖర్చు రూ.2758 కోట్లు కాకుండా రూ1,863 మాత్రమే అనుమతించింది. డిస్కాములు నెలనెలా వసూలు చేసిన రూ.2,787 కోట్లలో ఈ సొమ్ము తగ్గించి, మిగిలిన రూ.923 కోట్లు ట్రూడౌన్‌గా 2025 నవంబర్ నుండి 2026 అక్టోబర్ వరకు ప్రతి నెలా యూనిట్‌కు పదమూడు పైసల చొప్పున వినియోగదార్లకు తిరిగి ఇవ్వాలని ఎపిఇఆర్‌సి ఉత్తర్వులిచ్చింది. అంటే ఏడాదిపాటు రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదార్ల నుండి వసూలు చేసిన రూ.2,787 కోట్లలో రూ.923కోట్లు మాత్రమే ట్రూడౌన్ పేరిట తిరిగి రానున్న ఏడాది కాలంలో చెల్లిస్తారన్నమాట. వాస్తవం ఇది కాగా ప్రభుత్వం తన నిర్వహణ సామర్ధ్యంతో సుమారు వెయ్యి కోట్ల రూపాయలు ఆదా చేసినట్టు దాన్ని జనానికి దానం చేస్తున్నట్టూ చెప్పడం సబబు కాదు కదా! ఇదంతా చూస్తే ప్రయాణికుని జేబు కొట్టేసి, అతనికి టిక్కెట్ కొనిచ్చిన 'మహానుభావు'ని కథ గుర్తుకొస్తుంది కదా!

జనం నుండి వసూలు చేసిన సొమ్ములో మూడోవంతు కన్నా తక్కువ మొత్తాన్ని వారికి తిరిగి ఇస్తూ ప్రభుత్వం గొప్పలు చెబితే ఎలా? 2024-25 సంవత్సరంలో వసూలు చేసిన మొత్తం ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు రూ.2785 కోట్లు వినియోగదారులకు వాపసు (ట్రూ డౌన్) చేస్తే సర్కారు తన ఘనతగా కొంతైనా చెప్పడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు వసూలు చేస్తున్న 40 పైసల విధానాన్ని వెంటనే ఆపేస్తే సర్కారువారు తమ బాధ పట్టించుకున్నారని ప్రజలు భావిస్తారు. విద్యుత్ అదనపు భారాలు మోపబోమని కూటమి పార్టీలు ఎన్నికలలో హామీ ఇచ్చాయి. కానీ టిడిపి కూటమి ప్రభుత్వం మాట తప్పి 15 నెలల పాలనా కాలంలో రూ15,485 కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపడం దారుణం. అంటే టిడిపి అధికారానికి వచ్చాక వేసిన రూ15,485 కోట్ల భారంలో రూ.923 కోట్లు తగ్గించారనుకున్నా ఇంకా రూ14,562 కోట్లు ప్రజలపై అదనపు భారం వేసినట్టే కదా! ఇదే కాకుండా ప్రతినెల 40 పైసలు చొప్పున అదనంగా సర్దుబాటు చార్జీలు ఇంకా వసూలు చేస్తున్నారు. ఇంతా చేస్తూ జనంపై భారాలు వేస్తూనే ప్రభుత్వం ఏదో మేలు చేస్తోందన్న రీతిలో ప్రచారం చేస్తే జనం నమ్ముతారా? కాబట్టి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అదనంగా మోపిన మొత్తం భారాలను తగ్గించి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలి.

ముఖ్యమంత్రి అంతటివారే అలా చెప్పడంతో రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు కూడా అదే పల్లవి అందుకున్నారు. ఒకవేళ వారు చెప్పినట్టు ప్రభుత్వ నిర్వహణా సామర్థ్యం వల్లనే ఈ మిగులు తేలిందని అనుకోవాలంటే ఈ ప్రభుత్వం నడిపే మూడు డిస్కాముల్లోనూ మిగలాలి కదా! కానీ రెండు డిస్కాములు ఇంకా ట్రూ అప్ ఛార్జీలు వేయాలంటూ ఎపిఇఆర్‌సిని ఎందుకు కోరాయి? ఒక్కమాటలో చెప్పాలంటే ఇపిడిసిఎల్ శ్రీకాకుళం నుండి పశ్చిమగోదావరి వరకు గల 10 జిల్లాల్లో మిగిలిన సొమ్మును రాష్ట్రంలోని అందరు వినియోగదార్లకూ సర్కారు వారు తిరిగి చెల్లిస్తున్నారు. ఇదీ వాస్తవం. ఏదో పొదుపు చేశామనీ, నిర్వహణా సామర్థ్యం వంటి మాటలు చెప్పడం పాలకులకు తగదు. ఇలాంటి మాటలు జనం నమ్మరు.

యుపిలో మరో కులదురహంకార హత్య
- 17 ఏళ్ల బాలికను కాల్చి చంపిన తండ్రి

ముజఫర్‌నగర్ : బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో మరో కుల దురహంకార హత్య చోటు చేసుకుంది. దేశవ్యాప్తంగా బాలికల దినోత్సవం నిర్వహించుకున్న ఆదివారంనాడే షామ్లి జిల్లా కండ్లా పోలీస్‌స్టేషన్ పరిధి అంబేహ్త గ్రామంలో 17 ఏళ్ల బాలికను తండ్రి తుపాకీతో కాల్చిచంపాడు. సొంతింట్లో పై అంతస్తులో జరిగిన ఈ హత్యలో బాలిక 15 ఏళ్ల సోదరుడి ప్రమేయం కూడా ఉందని జిల్లా ఎస్‌పి ఎన్‌పి సింగ్ తెలిపారు. తండ్రి, సోదరుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాలికను హత్య చేసినట్లు తండ్రి అంగీకరించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించినట్లు చెప్పారు. స్థానికుల కథనం ప్రకారం.. ఇంటర్ చదువుతున్న బాలిక అదే ప్రాంతానికి చెందిన ఒక అబ్బాయితో చాటింగ్ చేస్తుండగా గమనించిన తండ్రి ఈ దారుణానికి తెగబడ్డాడు.

కరువు రహిత రాష్ట్రంగా చేయడమే లక్ష్యం

- చెరువులు, రిజర్వాయర్లను నీటితో నింపాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని చెరువులు, రిజర్వాయర్లను నీటితో నింపాలని జిల్లా కలెక్టర్లు, జలనవరులశాఖ అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సిఎం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. అన్ని చెరువులను అనుసంధానిస్తూ ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూగర్భ జలాలు పెరగడంతోపాటు కరువు అనేది తలెత్తకూడదన్నారు. ఇందుకు జిల్లాల కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. రాయలసీమలో ఇంకా 9 టిఎంసిల నీటిని చెరువుల్లో నింపాల్సి ఉందన్నారు. ఒకపక్క కృష్ణా, గోదావరి నుంచి రోజూ వేల క్యూసెక్కుల కొద్దీ వరద జలాలు సముద్రంలో కలుస్తుంటే మరోవైపు 200 టిఎంసిల నీటిని వినియోగించుకునేందుకు పోరాడాల్సి వస్తోందన్నారు. నీటి విలువను గుర్తించి అధికార యంత్రాంగం పనిచేయాలని సిఎం సూచించారు. గతంలో అన్నా హజారే, రాజేంద్రసింగ్ వంటి వారితో భూగర్భ జలాలు పెంచడానికి, నీటి

భద్రతకు ఎన్నో చర్యలు చేపట్టినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో 19 లక్షల వరకు వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయని, వాటి ద్వారా లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోందని, ఇందుకు భూగర్భ జలాలు పెంచడం తప్పనిసరని పేర్కొన్నారు. రాష్ట్రంలో మేజర్, మీడియం రిజర్వాయర్ల సామర్థ్యం 1,106 టిఎంసిలు ఉంటే ప్రస్తుతం 965 టిఎంసిల నీటిని నింపినట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. గతేడాది ఇదే సమయానికి 907 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయని, మరో 13 శాతం మేర రిజర్వాయర్లు నింపాల్సి ఉందని తెలిపారు. ఈ సమీక్షలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు

సిఎం చంద్రబాబు మంగళవారం విజయవాడ నుంచి ఢిల్లీ వెళ్లనున్నారు. విశాఖలో నవంబరు 14, 15 తేదీల్లో సిఐఐతో కలిసి నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సుకు ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నారు. భాగస్వామ్య సదస్సుకు దేశ, విదేశాల్లోని పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకు ప్రభుత్వం రోడ్‌షోలు నిర్వహిస్తూ పారిశ్రామికవేత్తలను ఇప్పటికే ఆహ్వానించే కార్యక్రమం చేపట్టింది. ఈ క్రమంలో ఢిల్లీలో మంగళవారం సాయంత్రం 4:45 గంటలకు ఐటిసి మౌర్యలో జరిగే సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కర్టన్ రైజర్ కార్యక్రమంలో సిఎం పాల్గొననున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌తో భేటీ కానున్నారు. అనంతరం రాత్రికి సిఎం ఢిల్లీలోనే బస చేయనున్నారు. అక్టోబరు ఒకటిన ఢిల్లీ నుంచి నేరుగా సిఎం చంద్రబాబు విశాఖపట్నం చేరుకుని అక్కడ నుంచి విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గంలోని దత్తి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:40 గంటలకు పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. అనంతరం ఉండవల్లిలోని ఆయన నివాసానికి చేరుకుంటారని సిఎంఒ వర్గాలు తెలిపాయి.

జిఎస్‌టిపై విస్తృత ప్రచారం

మంత్రివర్గ ఉపసంఘానికి సిఎం సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

జిఎస్‌టి పన్నుల విధానంలో కొత్తగా చేసిన మార్పుల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. జిఎస్‌టిపై ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘంతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రచారంలో భాగంగా ప్రత్యేక థీమ్‌లను రూపొందించాలని, ఇంటింటికి అవగాహన కల్పించాలని చెప్పారు. అక్టోబర్ 18 నాటికి క్షేత్ర స్థాయి ప్రచారాన్ని ముగించాలని, 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో షాపింగ్ ఫెస్టివల్, ఆదే రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద హోర్డింగ్‌లు కూడా ఏర్పాటు చేయాలని చంద్రబాబు సూచించారు. . దీనిపై అధికారులు స్పందిస్తూ ఇప్పటికే వివిధ అంశాలపై జిఎస్‌టి ఫలాలను వివరిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించామని ముఖ్యమంత్రికి వివరించారు. కాగా ఈ ప్రచారాన్ని ప్రత్యేక ప్రణాళిక ద్వారా నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. వ్యవసాయం, ఎంఎస్‌ఎంఇ, చేనేత ఉత్పత్తులు, ఆక్వా, విద్యా రంగం, బీమా, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్, భవన నిర్మాణ రంగం, పర్యాటకం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్ రంగం, ఆటోమొబైల్స్ వంటి రంగాల్లో ఆయా శాఖల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. రైతులకు అవగాహన పెరిగేలా ట్రాక్టర్ ర్యాలీలు, యంత్రాల ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆప్కో, లేపాక్షి, ఒక జిల్లా-ఒక ఉత్పత్తి పేరిట మేళాలు, ఉత్పత్తులపై పన్ను తగ్గింపు వల్ల కలిగే లాభాలుపైనా ప్రచారం చేయాలని నిర్దేశించారు. సెలూన్లు, యోగా సెంటర్లు, జిమ్‌లలో జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే వ్యత్యాసాన్ని వివరించాలని ఆదేశించారు.

విద్యార్థుల్లోనూ అవగాహన

జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనాలపై విద్యార్థుల్లో కూడా అవగాహన కల్పించాలని చంద్రబాబు సూచించారు. దీనికోసం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న ఏడు వేల ఉన్నత పాఠశాలలు, నాలుగు వేల జూనియర్ కళాశాలల్లో కూడా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై జిఎస్‌టి తగ్గింపు ఫలితాలు వివరించేందుకు వాటి ఉత్పత్తిదారులు డీలర్లతో జిల్లా, నియోజకవర్గ స్థాయిలో 850 ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

దసరా ఉత్సవాల్లో విషాదం

- విధుల నిమిత్తం వచ్చిన ఎస్‌ఐ మృతి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దసరా ఉత్సవాలకు బందోబస్తు విధుల నిమిత్తం విజయవాడ వచ్చిన ఎస్సై గుండెపోటుతో మృతి చెందారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ ఎస్‌ఐ శ్రీనివాసరావు హనుమాన్‌పేటలోని ఓ లాడ్జిలో బస చేశారు. సోమవారం ఉదయం బాత్రూంలో విగతజీవిగా పడి ఉన్న ఆయనను చూసి అక్కడి వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. .

నేడు పలు జిల్లాల్లో వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర, పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో మంగళవారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు కృష్ణా, గోదావరి నదులకు వరద ప్రవాహం హెచ్చుతగ్గులుగా కొనసాగుతుందని తెలిపారు. గోదావరి నదికి ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 9.71 లక్షల క్యూసెక్కులుగా ఉందని, బుధవారం నాటికి 12 లక్షల నుంచి 12.50 లక్షలకు చేరే అవకాశం ఉందని హెచ్చరించారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

'బల్క్‌డ్రగ్' పార్కు ఏర్పాటు విరమించుకోవాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలంలో రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న, మత్స్యకారుల ఉపాధికి, ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి భంగం కలిగించే బల్క్‌డ్రగ్ పార్కును ఏర్పాటు చేసే ఆలోచన విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం లేఖ రాశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం, రాజయ్యపేట, బోయపాడు, దొండవాక, పెద్దతీనార్ల, చిన్నతీనార్ల, ఎస్ రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామాల్లో బల్క్‌డ్రగ్ పార్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం 1,270.80 ఎకరాలకు గానూ, 450 ఎకరాలు సేకరించిందని, ఇంకా 820 ఎకరాలు సేకరించాల్సి ఉందని తెలిపారు. ఈ భూములు ఇవ్వబోమని రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.

కొత్తగా సేకరిచందలచిన భూ సేకరణ ఆపాలని ప్రజలు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. భూసేకరణ పూర్తికాకుండానే జనవరి 8న విశాఖపట్నంలో ప్రధాన మంత్రితో కలిసి బల్క్‌డ్రగ్ పార్కును వర్చువల్‌గా ప్రారంభించారని వివరించారు. భూసేకరణ జరగకుండానే రైతులు, ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించినప్పటికీ, ఆగస్టు 6న నక్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న ప్రజలందరూ బల్క్‌డ్రగ్ పార్కును వ్యతిరేకించారని, ఇప్పటికీ రాజయ్యపేట ప్రజలు, చుట్టుపక్కల గ్రామస్తులు నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారని వివరించారు. అయినప్పటికీ రాజయ్యపేట గ్రామం చుట్టూ రోడ్లు, డ్రెన్‌లు, అడ్మిన్ బిల్డింగ్, వాటర్ పంపులు నిర్మాణం జరుగుతోందని, ఇది పూర్తిగా చట్టాలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. అంతేకాక దీనికి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేవని తెలిపారు. బల్క్ డ్రగ్ పార్కు వస్తే ఈ ప్రాంతం వాతావరణ కాలుష్యం, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం మినీ కోనసీమగా పేరుగాంచిందని, కొబ్బరి తోటలు, జీడిమామిడి తోటలు, డ్రాగన్ ఫ్రూట్స్ వంటివి పండిస్తున్నారని వివరించారు.

డ్రిప్ సిస్టం ద్వారా రైతులు తోటలు వేసి పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు ఈ భూములు తప్ప వేరే మార్గం లేదని, వేలమంది కూలీలు ఈ తోటలపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ఎస్ రాయవరంలో కొబ్బరితోటలపై ఆధారపడి 23 కొబ్బరి పీచు కంపెనీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎగుమతి జరగడం వల్ల వందలమంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు వల్ల వీరి ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల్లో మత్స్యకారులకు సముద్రం వేట తప్ప మరొక ఆధారం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే హెటిరోడ్రగ్ మందుల కంపెనీ వదులుతున్న వ్యర్థ జలాల వల్ల మత్స్యసంపద నశించిపోయి ఇతర ప్రాంతాలకు మత్స్యకారులు వలసపోతున్నారని వివరించారు. కంపెనీ చుట్టూ జల కాలుష్యం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పుడు ఈ బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు వల్ల మత్స్యకారులు శాశ్వతంగా గ్రామాలు ఖాళీ చేసి వెళ్లిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అంతేకాకుండా జాతీయ ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్న 7,930 మంది కూలీలు ఉపాధి కోల్పోతారని పేర్కొన్నారు. కాబట్టి ప్రజాభిప్రాయాన్ని గౌరవించి రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న, మత్స్యకారుల ఉపాధికి, ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి భంగం కలిగించే బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేసే ఆలోచన విరమించుకోవాలని కోరారు.

ఆయుధ డిపో వద్దని కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఆయుధ డిపో పేరిట బలవంతపు భూసేకరణ తగదు

- రాజకీయ పార్టీలు, ఆదివాసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి
- ప్రజామోదం మేరకే ముందుకెళ్తామని వెట్రిసెల్వి హామీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ ఆయుధ డిపో పేరుతో బలవంతపు భూసేకరణ చేయడం తగదని, ప్రజలు, గిరిజనుల ఆమోదం లేకుండా సర్వే ప్రక్రియ ప్రారంభించడం అన్యాయమని, రెండు పంటలు పండే భూములు కాకుండా పంటలు సాగులో లేని భూముల్లో లేదా సమీప అటవీ భూముల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరుగుతున్న పిజిఆర్‌ఎస్‌లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి నేతలు వినతిపత్రం అందజేశారు.

ప్రజల ఆమోదం మేరకే ముందుకెళ్తామని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 30 యాక్ట్, 144 సెక్షన్లు అమలు చేసి పోలీసుల నిర్బంధ చర్యలను నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.రామ్మోహన్, బికెఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి జిల్లా నాయకులు మాట్లాడారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో 1,160 ఎకరాలు భూసేకరణ చేస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారని, అక్కడ ప్రజలు ఏమాత్రం ఈ భూ సేకరణను అంగీకరించడం లేదన్నారు.

ప్రజల అంగీకారం లేకుండా సర్వే ప్రక్రియ ప్రారంభించడం తగదన్నారు. అభివృద్ధికి ఎవరూ వ్యతిరేకం కాదని, అయితే మంచి పంటలు పండే భూములను, గిరిజన ప్రజల జీవనానికి ఇబ్బంది కలిగించేలా ఆయుధ డిపో ఏర్పాటు చేయడం అభ్యంతరకరమని అన్నారు. పంటలు సాగులో లేని భూముల్లో లేదా సమీప అటవీ భూముల్లో ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతిపాదిత వంకావారిగూడెంలో కాకుండా గిరిజనులకు, ప్రజలకు, రైతులకు ఇబ్బదులూ లేని వేరే ప్రాంతంలో ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

కొనసాగుతున్న గోదావరి ఉధృతి

- అమల్లో మొదటి ప్రమాద హెచ్చరిక
- విలీన మండలాల్లో 35 గ్రామాలకునిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతుంది. మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించిన కొన్ని గంటల్లోనే భారీగా వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 44.80 అడుగుల నీటి మట్టం ఉంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 11.70 అడుగులకు వరద తగ్గడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహ రించారు. ప్రస్తుతం ఇక్కడ వరద స్థిరంగా ఉంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లకు పైకి ఎత్తి 9,59,784 క్యూసెక్కుల నీటికి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం కనకాయలంక, మామిడి కుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే, అయినవిల్లి మండలంలో ఎదురుబిడెం కాజ్‌వేలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. దీంతో కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక, పి.గన్నవరం మండలం బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడుమూడిలంక, జి.పెదపూడిలంక, ఆచంట మండలం పెదమ ల్లంక, అనగాలంక, అయోధ్యలంక, మర్రిమూల గ్రామాల ప్రజలు, అయినవిల్లి మండలంలో పల్లపులంక, వీరవల్లిపాలెం, శానిపల్లిలంక ప్రజలు మర పడవలపై కాజ్‌వేలను దాటుతున్నారు. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వాగులు పొంగడంతో సుమారు 35 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి మరింత పెరుగుతుందనే అధికారుల హెచ్చరికలతో విలీన మండలాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

తొమ్మిదేళ్లలో రూ.2.03లక్షల కోట్లు మద్యం తాగేశారు !

- అత్యధికంగా గతేడాది రు.29,442 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వాలు మారినా విధానాలు మాత్రం మారడం లేదు. మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్ర ఖజానాకు లభించే ఆదాయమే దీనికి నిదర్శనం. తాజా లెక్కల మేరకు గత తొమ్మిది సంవత్సరాల్లో రాష్ట్రంలో ఏకంటా ఏకంగా 2,03,168 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరిగాయి. అంత మొత్తంలో విలువైన మద్యాన్ని ప్రజలు తాగడం ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చారు. 2019కు ముందు మద్యం అమ్మకాలు ప్రైవేటు రంగంలో సాగిన విషయం తెలిసిందే. అప్పట్లో వ్యాట్, మార్జిన్ మనీ, డిపాజిట్ల రూపంలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. దీనివల్ల కూడా ఖజానాకు దాదాపు నాలుగేళ్లలోనే 80 వేల కోట్ల వరకు ఆదాయం వచ్చింది. 2016-17 నుంచి చూస్తే తొమ్మిదిన్నరేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా2,03,168 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు తేలింది.

తొలి నాలుగు సంవత్సరాల్లో అంటే 2019-20 వరకు 71,799 కోట్ల రూపాయల అమ్మకాలు జరిగాయి. ఆ తరువాత 2020-21 నుండి 2024-25 వరకు 1,31, 369కోట్ల విక్రయాలు జరిగాయి. దీంతో తొమ్మిదేళ్లలో 2,03,168 కోట్ల రూపాయల విక్రయాలు జరిగినట్లు అధికారులు తేల్చారు. ఈ మొత్తం విక్రయాల ద్వారా 1,81,867 కోట్ల రూపాయల ఆదాయం రాష్ట్ర ఖజానాకు చేరింది.

మద్యం అమ్మకాలు, ఆదాయం వివరాలు (కోట్లలో)

ఏడాది	అమ్మకాలు	ఆదాయం
2016-17	13,462	13,480
2017-18	17,291	15,380
2018-19	20,118	17,340
2019-20	20,928	17,707
2020-21	20,189	17,966
2021-22	25,023	21,549
2022-23	28,113	23,804
2023-24	28,602	25,117
2024-25	29,442	28,844
మొత్తం	**2,03,168**	**1,81,187**

బల్క్‌డ్రగ్ పార్కుకు బ్రేక్

మొదటిపేజి తరువాయి

సముద్రానికి దూరం చేయొద్దని కోరారు. పోలీసులు ఎంత ప్రయత్నించినప్పటికీ, మత్స్య కారులు రోడ్డుపై నుంచి పక్కకు జరగలేదు. హోం మంత్రి కారులో నుంచి బయటకు వచ్చి సమస్య పరిష్కారమయ్యే వరకు బల్క్‌డ్రగ్ పార్క్ పనులను ఆపుతామని హామీ ఇచ్చారు. ఈ హామీతో మత్స్యకారులు శాంతించడంతో మంత్రి అక్కడి నుండి బయలు దేరారు. అనంతరం పాయకరావు పేట వద్ద విలేకరులతో మాట్లాడుతూ రాజయ్యపేట వాసులతో పాటు, అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్ష కమిటీని ఏర్పాటు చేస్తామని, వారిని సిఎం, డిప్యూటీ సిఎం వద్దకు తీసుకువెళ్తానని చెప్పారు. 'స్థానికుల వినతితో బల్క్‌డ్రగ్ పార్కు పనులు ఆపాలని ఆదేశించా. మత్స్యకారులతో ఎవ్వరూ రాజకీయాలు చేయవద్దు' అని ఆమె అన్నారు. అయితే, మత్స్యకారులు మాత్రం బల్క్‌డ్రగ్ పార్కును పూర్తిగా రద్దు చేసేంతవరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ప్రకటించారు.

ఆవేదన నుంచి పుట్టికొచ్చిన పోరాటం : సిపిఎం

రాజయ్యపేటలో ఏర్పాటు చేయనున్న బల్క్‌డ్రగ్ పార్కును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తక్షణమే ప్రకటించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మత్స్యకారులు చేస్తున్న పోరాటం వారి కష్టాల నుండి, ప్రస్తుతం వారు పడుతున్న ఇబ్బందులు నుండి, హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ వల్ల కోల్పోతున్న ఉపాధి, వాయు, జల కాలుష్యం నుండి కేన్సర్లు తదితర వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన ఆవేదన నుండి పుట్టికొచ్చిన పోరాటం తప్ప ఎవరో బయటనుండి రెచ్చగొడితే రెచ్చిపోయి చేస్తున్న పోరాటం కాదని హోం మంత్రి వంగలపూడి అనిత గమనించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పేర్కొన్నారు.

ప్రేమ పెళ్లి నిరాకరించడంతో ఆత్మహత్య

- రైలుకు ఎదురెళ్లి యువకుడు మృతి
- విషయం తెలిసి యువతి కూడా...

ప్రజాశక్తి - మేడికొండూరు (గుంటూరు జిల్లా)



గోపికృష్ణ, ప్రియాంక (ఫైల్ ఫోటో)

ప్రేమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో యువతీ యువకులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుంటూరు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. రైలుకు ఎదురు వెళ్లి యువకుడి చనిపోగా, ఈ విషయం తెలిసి అతన్ని పెళ్లి చేసుకున్న యువతి కూడా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఈనెల 27న పేరేచర్ల- ఫిరంగిపురం రైల్వే స్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. ఈ ఘటన వివరాలను అధికారులు సోమవారం వెల్లడించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కోనే గోపికష్ణ, మండలంలోని విశదల అండర్ రోడ్డు వద్ద గల ఎన్నారై ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఇసిఇ మూడో సంవత్సరం చదువుతున్నారు. అదే తరగతికి చెందిన గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన బి లక్ష్మీ ప్రియాంక ప్రేమించుకున్నారు. మేజర్లు కావడంతో ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నారు. అబ్బాయి తరుపు బంధువులు ఈ ప్రేమ వివాహాన్ని వ్యతిరేకించారు. ఈ విషయాన్ని తట్టుకోలేక గోపికష్ణ, ప్రియాంక ఇరువురు మనస్థాపానికి గురయ్యారు. దీంతో గోపికృష్ణ ఈనెల 27న సాయంత్రం రైలుకు ఎదురు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త గోపికృష్ణ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న ప్రియాంక కూడా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. నరసరావుపేట రైల్వే పోలీసులు మృతదేహాలకు పంచనామా నిర్వహించి నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన యాత్రికులు

- శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మ
- లక్ష మంది సందర్శన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సందర్శకులు పోటెత్తారు. సోమవారం మూల నక్షత్రం కావడంతో దుర్గమ్మ దర్శనానికి రద్దీ పెరిగింది. శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను రాత్రి ఎనిమిది గంటల సమయానికి 1,44,740 మంది యాత్రికులు దర్శించుకున్నారు. క్యూ లైన్లు, హోల్డింగ్ ఏరియాల్లోని 32 కంపార్ట్‌మెంట్లు పూర్తిగా సందర్శకులతో నిండిపోయాయి. దీంతో మిగిలిన సందర్శకులకు ఎక్కడా అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు కార్పస్ బ్రిడ్జ్ నుండి గద్ద బొమ్మ సెంటర్ వరకు రోప్ పార్టీలను ఏర్పాటు చేశారు. అలాగే కుమ్మరిపాలెం సెంటర్ నుండి దుర్గగుడి వరకు ఉన్న క్యూ లైన్లలోనూ సందర్శకుల రద్దీ నెలకొంది. సందర్శకుల రద్దీ కారణంగా ప్రకాశం బ్యారేజీపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి దుర్గమ్మను దర్శించుకున్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తమ కుటుంబ సభ్యులతో

కలిసి దుర్గమ్మను దర్శించుకున్నారు. బందోబస్తు ఏర్పాట్లను డిజిపి హరీష్ కుమార్ గుప్తా పరిశీలించారు.

ఆకట్టుకున్న తప్పెట గుళ్లు

విజయవాడ ఉత్సవ్ ఎగ్జిబిషన్‌లో తప్పెట గుళ్లు కళారూపం సందర్శకులను అలరించింది. ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో భీమవరంనకు చెందిన ఘంటశాల అవార్డు గ్రహీత, గాన గౌతమి చిప్పాడ నాగేశ్వరరావు నిర్వహించిన ఘంటశాల పాటల కచేరి శ్రోతలను అలరించింది. విజయవాడకు చెందిన శ్రీ పంచమ వేద కూచిపూడి నృత్యాలయం నాట్యాచారిణి కావ్య కంచర్ల బృందం కూచిపూడి నృత్యరవళి కన్నుల పండువుగా సాగింది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కాకినాడకు చెందిన తోట అన్నవరం బృందం వారి తోలు బొమ్మలాట కనువిందు చేసింది. రామాయణంలోని కథా సారాంశాన్ని కళ్ళకు కట్టినట్లు చూపారు. పశ్చిమగోదావరి జిల్లా మార్టూరుకు చెందిన ఇవ్వల యేసు రాజు బందం సంగీత విభావరి నిర్వహించారు. సరస్వతీ నమోస్తుతే, శుద్ధ సన్యాసి రాగ భావంలోని కీర్తన అంబ భవాని కీర్తన ఆకట్టుకున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ' నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'లో సోమవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడి ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను ఆయన తిలకించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ...ఉత్తరాంధ్ర సాంప్రదాయ కళ అయిన తప్పెట గుళ్ల ప్రదర్శన ఇక్కడ చూడటం గర్వంగా ఉందన్నారు. ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రులు, గవర్నర్లు పాల్గొనడం ఉత్సవ స్థాయిని మరింత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ఉత్సవ్ సభ్యుడు ముత్తవరపు మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు 30 శాతం తగ్గించాలి : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో అదనంగా దోచిన డబ్బును ఛార్జీల్లో తగ్గిస్తూ, వినియోగదారులకు భారీ ఉపశమనం ఇచ్చామని ప్రభుత్వం చెప్పకోవడం సిగ్గుచేటని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా ప్రస్తుతం ఉన్న ఛార్జీల్లో 30 శాతం తగ్గించాలని సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15,780 కోట్ల మేర ప్రజలపై సర్దుబాటు ఛార్జీల (ట్రూ అప్) భారం వేసిందన్నారు. ఇప్పుడు ట్రూడౌన్‌తో తగ్గిన భారం కేవలం రూ.923 కోట్లు అని చెప్పారు. టెలివిజన్ చర్చలో బిజెపి కేరళ నాయకుడు పింటు మహదేవ్.. రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలను పిసిసి ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ ఖండించారు.

పింఛన్లకు రూ.2,745 కోట్లు విడుదల

- విజయనగరం జిల్లా దత్తిలో పంపిణీ చేయనున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ భరోసా పింఛను పథకంలో భాగంగా 63,50,765 మంది లబ్ధిదారులకు పింఛను మొత్తం రూ.2,745.05 కోట్లను గ్రామ, వార్డు సచివాలయాలకు విడుదల చేసినట్లు సూక్ష్మ, గ్రామీణ పేదరిక నిర్మూలనశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తగా 10,578 మంది స్పౌజ్ పెన్షన్ లబ్ధిదారులకు రూ.4.23 కోట్లు విడుదల చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబరు ఒకటి నుంచి పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. విజయనగరం జిల్లా, దత్తిరాజేరు మండలం, దత్తి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమైన అనంతరం ఈ పథకంలో రూ.45 వేలకోట్లు లబ్ధిదారులకు అందించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.19,111.85 కోట్లు విడుదల చేశామని చెప్పారు. పింఛనను లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నామన్నారు.

గరుడసేవ విజయవంతం : సిఎం అభినందనలు

ప్రజాశక్తి - తిరుమల

అత్యంత విశిష్టమైన తిరుమల శ్రీవారి గరుడ వాహన సేవను అద్భుతంగా నిర్వహించినందుకు టిటిడి, జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. తన అధికారిక ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ల ద్వారా ముఖ్యమంత్రి స్పందించారు. ఈ పవిత్ర గరుడ వాహన సేవలో పాల్గొనేందుకు తరలివచ్చిన మూడు లక్షల మందికి పైగా యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి అపూర్వమైన అనుభూతిని అందించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన టిటిడి పాలకమండలి, దేవస్థానం అధికారులను, జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

నవంబరు 3 నుంచి ఆర్‌సెట్ పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిఆర్‌సిఇటి)-2025ను నవంబరు 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి వెల్లడించింది. ఈ మేరకు మండలి కార్యదర్శి బి తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షను పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహిస్తుందని, ఇందుకు సంబంధించిన వివరాలను అక్టోబరు 6న విడుదల చేస్తామని పేర్కొన్నారు. అక్టోబరు 7 నుంచి అభ్యర్థులు అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

6 వరకు డిగ్రీ వెబ్ ఆప్షన్లు

డిగ్రీ అడ్మిషన్ల రెండో దశ కౌన్సెలింగ్ జరుగుతోంది. అక్టోబరు 6వ తేదీ వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చునని కార్యదర్శి తిరుపతిరావు మరో ప్రకటనలో తెలిపారు. 7న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. 10న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు 11 నుంచి 13వ తేదీ వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని వెల్లడించారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలత

- డైరెక్టర్ శివప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం గా ఉందని జిఎస్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ ఎం శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24న జిఎస్‌డబ్ల్యుఎస్ సెక్రటరీతో కలిసి జెఎసి నేతలతో చర్చించామన్నారు. తమ దృష్టికి తీసుకొచ్చిన ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ కూడా ప్రారంభించిం దన్నారు. ఈ మేరకు ఉద్యోగులందరూ విధులకు హాజరై ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం లేకుండా సక్రమంగా నిర్వహించాలని ఆయన కోరారు.

గిరిజన సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- నిరసనగా ర్యాలీ, కలెక్టరేట్ వద్ద బైఠాయింపు
- నిరాధార ఆరోపణలు తగవు : అశోక్

ప్రజాశక్తి - పార్వతీపురం మన్యం జిల్లా

పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలంలోని రావికోన పంచాయతీ సర్పంచ్ కె రామస్వామి చెక్ పవర్ రద్దుపై గిరిజనులు భగ్గుమన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య భవనం నుంచి పార్వతీపురం కలెక్టరేట్ వరకు గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ అశోక్ మాట్లాడుతూ గిరిజన సర్పంచ్‌పై నిరాధార ఆరోపణలు తగవన్నారు. గిరిజనుల హక్కులు తరతరాల పోరాట చరిత్ర అని, దాన్ని అక్రమంగా, దౌర్జన్యంగా నిర్వీర్యం చేసే దిశగా టిడిపి కూటమి ప్రభుత్వం చర్యలు ఉన్నాయని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ సర్పంచ్ రామస్వామిపై డిపిఒ టి కొండలరావు కుట్రపూరితంగా కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని, దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మండలంలో జరుగుతున్న అనేక అరాచకాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలను జనరల్ బాడీ సభల్లో ప్రశ్నిస్తున్న ఏకైక వ్యక్తి రామస్వామేనని, ఇది ఓర్వలేక స్థానిక రాజకీయ నాయకులు సర్పంచ్‌పై బురద జల్లారని అన్నారు. రావికోన సర్పంచ్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె రామస్వామి మాట్లాడుతూ డిపిఒ తనపై వేసిన నివేదికకు బదులుగా తాను తిరిగి ఇచ్చిన నివేదికను పరిగణంలోకి తీసుకోకపోవడం వెనుక రాజకీయ హస్తం ఉందని విమర్శించారు.

అధికారులు ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసినా గిరిజనుల పక్షాన్నే నిలుస్తామని తేల్చి చెప్పారు. దీనిపై న్యాయపోరాటం కూడా చేపడతామని అన్నారు. కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ సర్పంచ్ చెక్ పవర్ రద్దుపై విచారణ చేపడుతున్నామని, విచారణ నివేదిక అందిన వెంటనే తగిన చర్యలు చేపడతామని తెలిపారు. ఆందోళనలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

13 ఏళ్ల నాటి ఫిర్యాదుపై కేసు నమోదు చేయరేం?

- పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

పెళ్లి జరిగాక అత్తింట భర్త, అత్తమామల వేధింపులను భరించలేక కూతురు పుట్టింటికి చేరింది. కొద్ది రోజుల తర్వాత మళ్లీ అత్తింటికి వెళ్లిన తర్వాత కనబడకుండాపోయింది. తమ అల్లుడు, అతని తల్లిదండ్రులే కారణమంటూ ఫిర్యాదు చేస్తే పోలీసులు 13 ఏళ్లుగా కేసు కట్టకుండా కాలయాపన చేస్తున్నారని కలెక్టర్ వద్ద గోడు చెప్పుకున్నారు. సాక్షాత్తు ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. న్యాయసేవాధికార సంస్థ తలుపు తట్టారు. ఆ తర్వాత మానవ హక్కుల కమిషన్‌కు వెళ్లారు. ఫలితం లేకపోవడంతో అలిసిపోయిన తండ్రి హైకోర్టు మెట్లు ఎక్కారు. 2017 నుంచి హైకోర్టులో చేస్తున్న పోరాటంలో ఆ తర్వాత ఏడాది ఎస్‌పి కౌంటర్ వేశారు. పిటిషన్ తాజాగా విచారణకు రావడంతో పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహించింది. ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించడం సబబుగా ఉంటుందని, ఇందుకు తగిన ప్రాథమిక ఆధారాలు కూడా ఉన్నాయని జస్టిస్ బి దేవానంద్ అభిప్రాయపడ్డారు.

పశ్చిమగోదావరి జిల్లా, జీలుగుమిల్లి మండలం, కామయ్యపాలెం గ్రామానికి చెందిన చిన్న రైతు బండారు ప్రకాశరావు తన కూతురు మంగాదేవిని మోహన బ్రహ్మాజీకి ఇచ్చి కొన్నేళ్ల క్రితం పెళ్లి చేశారు. కట్నకానుకల కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారని చెప్పి మంగాదేవి 2012లో పుట్టింటికి వచ్చేసింది. తల్లిదండ్రులు కానుకలను కూడా సర్దుబాటు చేసి అత్తింటికి పంపారు. 2012 అక్టోబరు 18న అల్లుడు బ్రహ్మాజీ ఫోన్ చేసి తన భార్య ఎక్కడికో వెళ్లిపోయిందని, కనబడటం లేదని చెప్పాడు. దీనిపై ప్రకాశరావు ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా రిజిస్టర్ చేశారు. అల్లుడు, వారి తల్లిదండ్రులపై అనుమానంతో చేసిన ఫిర్యాదులో 13 ఏళ్లుగా ఎలాంటి పురోగతి లేకపోవడంపై హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిని వివరించాలని ఎస్‌పిని ఆదేశించింది. విచారణను అక్టోబరు 19కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

పోలీసులకు ప్రమాదబీమా పునరుద్ధరణ

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీస్ సిబ్బందికి పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ (జిపిఎఐ) పునరుద్ధరణలో భాగంగా 'గుప్తా న్యూ ఇండియా అస్యూరెన్స్' కంపెనీ లిమిటెడ్‌తో ఒప్పందం కుదిరిందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా సోమవారం తెలిపారు. ఈ మేరకు డిజిపి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఒప్పందం ప్రకారం కానిస్టేబుల్ నుంచి డిజిపి స్థాయి వరకు ప్రమాదవశాత్తు మరణించిన వారికి ర్యాంకు ఆధారంగా రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు, హోమ్‌గార్డులకు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా కల్పించినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.7 కోట్ల 68 లక్షల 50 వేల చెక్కును గుప్తా న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు డిజిపి అందజేశారు. ఈ నగదు రహిత పాలసీ ఈ నెల 29 నుంచి ఏడాది పాటు ఉంటుందని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటామని డిజిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజిపి లా అండ్ ఆర్డర్ రవిప్రకాష్, భద్రత సెక్రటరీ హరికుమార్ (రిటైర్డు ఐపిఎస్), గుప్తా న్యూ ఇండియా అస్యూరెన్స్ సిఇఒ రాజన్ పాల్గొన్నారు.

అదాని సిమెంట్‌కు అనుమతులు, పబ్లిక్ హియరింగ్ రద్దు చేయాలి

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసేందుకు సిద్ధపడిన అదాని సిమెంట్ కంపెనీకి అనుమతులు, పబ్లిక్ హియరింగ్ రద్దు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు యుఎస్ఎన్.రాజుతో కలిసి సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి జగ్గునాయుడు మాట్లాడారు. అదాని అంబుజా సిమెంట్ కంపెనీ సాగరతీరం, జనావాసాల మధ్య ఏర్పాటు చేయడం వల్ల గంగవరం, పెదగంట్యాడ మొదలు గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం, సింధియా, శ్రీహరిపురం వరకు గల విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లోని సుమారు పది లక్షల మంది ప్రజలు అనారోగ్యాల పాలవుతారని తెలిపారు. ఈ పరిశ్రమ వల్ల గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, శబ్ద కాలుష్యం పెరుగుతుందని వివరించారు. భారీ వాహన రాకపోకలు పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. ఈ పరిశ్రమకు కేటాయించదలచిన భూముల్లో వృక్షాలు, కొన్ని రకాల వన్యప్రాణులు కనుమరుగవుతాయని, పర్యావరణానికి హాని చేకూరుతుందని చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్థానిక ఎంపి శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రముఖులు, పర్యావరణ పరిరక్షణ సంస్థలు, అపార్ట్‌మెంట్, నివాస ప్రాంతాల అసోసియేషన్లు, గ్రామ సంఘాలు ఐక్యమై ఈ కంపెనీ అనుమతులు, పబ్లిక్ హియరింగ్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కేవలం 60 పర్మినెంటు, 200 మందికి కాంట్రాక్టు ఉపాధి మాత్రమే లభిస్తుందని, అది కూడా స్థానికులకు ఇస్తారన్న గ్యారంటీలేదని అన్నారు. అదాని సిమెంట్ కంపెనీ వల్ల ప్రజానీకానికి, పర్యావరణానికి వచ్చే ప్రమాదాన్ని వివరించి, దీనిని నిలువరించేదానికి ప్రజలను సన్నద్ధం చేసేందుకు సిపిఎం ఇప్పటికే లక్షల సంఖ్యలో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తోందన్నారు. పాదయాత్రలు, గ్రూప్ మీటింగులు నిర్వహిస్తోందని, పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తోందని చెప్పారు.

ఇఒఐని తక్షణమే రద్దుచేయాలి

- విశాఖ స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ధర్నా

ప్రజా శక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇఒఐని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట సోమవారం ధర్నా చేశారు. కార్మికులకు సకాలంలో పూర్తి జీతాలు చెల్లించాలని, బకాయి వేతనాన్ని ఇవ్వాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులకు తిరిగి తీసుకోవాలని తదితర అంశాలతో ఈ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇఒఐ తీసుకురావడం ద్వారా 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అన్న నినాదం మరుగునపడి 'విశాఖ ఉక్కు-కాంట్రాక్టర్ హక్కు'గా రూపాంతరం చెందుతుందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఆపరేషన్‌లో కాంట్రాక్ట్ జోక్యం పెరగడం అంటే ప్రైవేట్ వారికి కట్టబెట్టడమే అవుతుందని వివరించారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మించి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియుసి చీఫ్ పాటర్న్ ఎం రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మిట్టల్ పరిశ్రమపై చూపుతున్న ప్రేమను విశాఖ ఉక్కుపైనా చూపించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు నాయకులు ఎన్ రామారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్, అధ్యక్షులు వైటి దాస్, స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియుసి అధ్యక్షులు పివి రమణమూర్తి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అంతరాయం కలగకుండా ఉద్యమాన్ని శాంతియుతంగా నిర్వహిస్తున్నామని, అయినా కేంద్ర ప్రభుత్వం స్థానిక స్టీల్ యాజమాన్యాన్ని ప్రయోగించి కార్మిక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేస్తుందని విమర్శించారు. కేంద్రంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేసి ప్లాంట్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, కెఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, టివికె రాజు, పుల్లారావు, కె గంగాధర్, బి మహేష్, శ్రీనివాసరెడ్డి, మోహిత్‌దీన్ పాల్గొన్నారు.

ఆలయ భూముల ఇ-క్రాప్ వెంటనే పూర్తి చేయాలి

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఆలయ భూములను కౌలు రైతులు వేలం పాటలో దక్కించుకుని సాగు చేసుకుంటున్నారని, ఆయా భూములకు వెంటనే ఇ-క్రాప్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇ-క్రాప్ పూర్తి కాకపోవడంతో ఎరువులు, పురుగుమందులు కొరత ఏర్పడినప్పుడు ఆలయ భూములు సాగుచేసుకుంటున్న కౌలు రైతులకు ఎరువులు, పురుగుమందులు అందడం లేదన్నారు. ఇ-క్రాప్ చేయకపోతే పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట అమ్ముకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. దేవాదాయ, భూ పరిపాలన, వ్యవసాయశాఖలు సంయుక్తంగా ఇ-క్రాప్ ప్రక్రియను పూర్తి చేయాలని వారు కోరారు. లేని పక్షంలో దేవాదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులు తీవ్ర నష్టపోతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇ-క్రాప్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయని పక్షంలో రైతాంగం చేసే ఆందోళనలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బి శ్రీనివాసరావు

సహిత విద్య అమల్లో ముందుండాలి

- తొలిసారి సమావేశమైన సలహా కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహిత విద్య అమలులో రాష్ట్రం ముందుండాలని సహిత విద్య (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్) సలహా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటుచేసిన ఈ కమిటీ సమావేశం సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు అధ్యక్షతన విజయవాడలో సోమవారం సమావేశమైంది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో 747 మంది సహిత విద్య రిసోర్స్ పర్సన్స్ (ఐఇఆర్‌పిఎస్) పనిచేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించడంతోపాటు ప్రతి శనివారం దాదాపు 3 వేల మంది విద్యార్థులకు ఇంటివద్దే విద్య అందిస్తున్నారని చెప్పారు. ఇంటివద్ద ఉండే విద్యార్థులకు డ్రై రేషన్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో యుడైస్ ప్రకారం అన్ని పాఠశాలల్లో ప్రస్తుతం 1 నుంచి 12వ తరగతి వరకు 89,435 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారని తెలిపారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు 16,238 మంది కొత్త విద్యార్థులను నమోదు చేశామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 679 భవిత కేంద్రాల ద్వారా 13,580 మంది పిల్లలకు ఫిజియో థెరపీ, రెమిడియల్ విద్య, కౌన్సెలింగ్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో రవాణా భత్యం రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెరిగిందన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించడానికి అదనంగా రూ.2 వేలు అలవెన్స్ ఇస్తున్నామని చెప్పారు. ఇంటి వద్ద చదివే విద్యార్థులకు రూ.3 వేల సహాయం అందిస్తున్నామని వివరించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు స్పెషల్ ఒలింపిక్స్ భారత క్రీడల్లో జాతీయ స్థాయి పతకాలు సాధించారని వివరించారు. దీంతోపాటు ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల బలోపేతానికి సంబంధించి చిన్న వయసులోనే వైకల్యాన్ని గుర్తించడం, ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణ, డిజిటల్ లెర్నింగ్ టూల్స్ వంటి భవిష్యత్తు లక్ష్యాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో సలహా కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్‌కుమార్, పివి పార్థసారధి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి కె రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,788 కోట్లు చెల్లించాం

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వదిలిపోయిన విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల్లో ఇప్పటి వరకు రూ.1,788 కోట్లు తీర్చామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్థిక సమస్యల వల్ల ఏ విద్యార్థి చదువు ఆగిపోకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. పాత ఫీజు రీయంబర్స్‌మెంట్ విధానం అమలు చేసి తల్లిదండ్రులపై భారాన్ని తగ్గించడమే కాకుండా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ అండగా నిలిచారన్నారు. ఇప్పటికే 10 లక్షల మందికి పైగా విద్యార్థుల సర్టిఫికెట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామన్నారు.

ట్రూడౌన్ పదాన్ని పరిచయం చేశాం : మంత్రి డోలా

ఇప్పటి వరకు ప్రజలు ట్రూఅప్ అనే పదం విన్నారని, తాము కొత్తగా ట్రూడౌన్ పదాన్ని పరిచయం చేస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేస్వామి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని తమ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ ప్రకారం 13 పైసలు మేర తగ్గించామని తెలిపారు. స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లను 17 నుంచి 6.8 శాతానికి తగ్గించామన్నారు. లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యారావు మాట్లాడుతూ.. పల్నాడులో హత్యకు గురైన చంద్రయ్య కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్న నిర్ణయాన్ని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అడ్డుకున్నారని విమర్శించారు. ఇది మానవత్వ రహిత చర్య అని పేర్కొన్నారు.

ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

శ్రీ. నన్నపనేని అంకప్ప చౌదరి, శ్రీ. ఎన్.అన్నా రావు, శ్రీమతి నన్నపనేని చిట్టెమ్మ మరియు శ్రీమతి నన్నపనేని లీలా కమల కుమారి బ్యాంక్రప్టీసీల విషయంలో

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వర్సెస్ మెసర్స్ ప్రిస్మాక్ బయోటెక్నిక్స్ లిమిటెడ్‌కు శ్రీ.నన్నపనేని అంకప్ప చౌదరి, శ్రీ.ఎన్ అన్నా రావు, శ్రీమతి నన్నపనేని చిట్టెమ్మ మరియు శ్రీమతి నన్నపనేని లీలా కమల కుమారి వ్యక్తిగత హామీదారుల విషయంలో IA (IBC) 2349/2024 in CP (IB) No. 333/95/HDB/2022, IA (IBC) 2348/2024 in CP (IB) No. 337/95/HDB/2022, IA (IBC) 2350/2024 in CP (IB) No. 331/95/HDB/2022 and IA (IBC) 2351/2024 in CP (IB) No. 329/95/HDB/2022లో గౌరవ ఎన్‌సిఎల్టీ, హైదరాబాద్ బెంచ్-1 ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ నన్నపనేని అంకప్ప చౌదరి, శ్రీ ఎన్ అన్నా రావు, శ్రీమతి నన్నపనేని చిట్టెమ్మ మరియు శ్రీమతి నన్నపనేని లీలా కమలకుమారి (బ్యాంక్రప్టీసీల) ఆస్తులను ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (బ్యాంక్రప్టీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారెంటర్స్ టు కార్పొరేట్ డెటార్స్) రెగ్యులేషన్స్, 2019లోని రెగ్యులేషన్ 27 ప్రకారం షెడ్యూల్ 2 లోని పార్ట్-ఏ ప్రకారం ఈ-వేలం ప్లాట్‌ఫామ్: https://bankeauctions.com ద్వారా విక్రయించాలని ప్రతిపాదించబడిందని ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది.

క్ర.సం.	ప్రత్యేకతలు	వివరాలు
1	ధరావత్తుతోపాటుగా బిడ్ పత్రాలు దాఖలు చేయుటకు చివరి తేది	27-10-2025
4	సైటు తనిఖీచేయు/ సైటు దర్శించు తేది	20-10-2025 నుండి 25-10-2025 ఉ.10.00గం.ల నుండి సా.5.00గం.ల మధ్య
5	ఇ-వేలం తేది	29-10-2025న ఉ.10.00గం.ల నుండి సా.5.00 గం.ల (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడగింపులతో)
6	బ్యాంక్రప్టసీ ట్రస్టీ పేరు, చిరునామా& ఇమెయిల్	**మలిగి మధుసూదన రెడ్డి** ఎంఎంఆర్ లయన్ కార్ప్, 4వ అంతస్తు, హెచ్ఎస్ఆర్ ఈడెన్, క్రీమ్ స్టోన్ ప్రక్కన, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034. Email: btprismack@gmail.com . Mob No: 9848271555

క్ర. సం.	ఆస్తి నెం.	వివరాలు	విస్తీర్ణం	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు రూ.	బిడ్ పెంపుదల విలువ (రూ.)
1	1	ఎ) సర్వే నెం.లు 610/6బి, 9బి, 614/2ఏ & 2బి, ఆలూరు గ్రామం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లాలోని ఎక 3.86 సెంట్లు వ్యవసాయ భూమి ఎన్.ఎ. చౌదరి మరియు ఎన్.అన్నారావులకు చెందినది. బి) సర్వే నెం.లు 610/7బి, 1బి, 2ఏ, 2బి & 613/1సి, 2ఇ, 4, ఆలూరు గ్రామం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా లోని ఎక 2.935 సెంట్లు వ్యవసాయ భూమి ఎన్.చిట్టెమ్మలకు చెందినది. సి) సర్వే నెం.లు 610/3బి, 4, 6బి, 7బి& 8బి, ఆలూరు గ్రామం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లాలోని ఎక 2.825 సెంట్ల వ్యవసాయ భూమి ఎన్. లీలా కమల కుమారి & ఎన్. అన్నారావుకు చెందినది. డి) సర్వే నెం.609/1, ఆలూరు గ్రామం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లాలోని ఎక 1.86 సెంట్ల వ్యవసాయ భూమి ఎన్.చిట్టెమ్మలకు చెందినది.	11.48	1,81,29,413	18,12,941	2,00,000
2	2	సర్వే నెం.260/17, 263/8&9, పొన్నూరు మునిసిపాలిటీ, గుంటూరు జిల్లాలోని ఎక 1.33 సెంట్ల ఖాళీ భూమి శ్రీ ఎన్.ఎ.చౌదరి& శ్రీ ఎన్.అన్నారావులకు చెందినది.	1.33	97,50,563	9,75,056	1,50,000
3	3	సర్వే నెం.275/2ఏ, పొన్నూరు మునిసిపాలిటీ, గుంటూరు జిల్లాలోని ఎక 1.24 సెంట్ల ఖాళీ భూమి శ్రీ ఎన్.ఎ.చౌదరి & శ్రీ ఎన్.అన్నారావులకు చెందినది.	1.24	1,06,71,750	10,67,175	1,50,000
4	4	సర్వే నెం.242/1, పొన్నూరు మునిసిపాలిటీ, గుంటూరు జిల్లాలోని ఎక 0.28 సెంట్ల స్థలం, దానిపై నిర్మాణాలతో పాటు శ్రీ ఎన్.ఎ.చౌదరి & శ్రీ ఎన్.అన్నారావుకు చెందినది.	0.28	1,31,62,500	13,16,250	1,50,000
5	5	సర్వే నెం.33/1ఏ, పొన్నూరు మునిసిపాలిటీ, గుంటూరు జిల్లాలోని ఎక 0.19 సెంట్ల ఖాళీ భూమి శ్రీ ఎన్.ఎ.చౌదరి & శ్రీ ఎన్.అన్నారావు & శ్రీమతి ఎన్.చిట్టెమ్మకు చెందినది.	0.19	1,10,16,000	11,01,600	1,50,000
6	6	సర్వే నెం.31/4, 5&7, పొన్నూరు మునిసిపాలిటీ, గుంటూరు జిల్లాలోని ఎక 0.27 సెంట్ల ఖాళీ భూమి శ్రీ ఎన్.చౌదరి & శ్రీ ఎన్.అన్నా రావు & శీమతి ఎన్. చిట్టెమ్మ కు చెందినది.	0.27	1,51,20,000	15,12,000	1,50,000
7	7	సర్వే నెం.262/8 బి, పొన్నూరు మునిసిపాలిటీ, గుంటూరు జిల్లాలోని ఎక 0.50 సెంట్ల ఖాళీ భూమి ఎన్. చిట్టెమ్మకు చెందినది.	0.5	49,78,125	4,97,813	1,00,000
8	8	సర్వే నెం.280/2, పొన్నూరు మునిసిపాలిటీ, గుంటూరు జిల్లాలోని ఎక 0.64 సెంట్ల ఖాళీ భూమి ఎన్.చిట్టెమ్మకు చెందినది.	0.64	73,72,800	7,37,280	1,00,000
9	10	సర్వే నెం.261/1, 32/1, నిడుబ్రోలు(పొన్నూరు), గుంటూరు జిల్లాలోని ఎక 1.49 సెంట్ల ఖాళీ భూమి ఎన్. చిట్టెమ్మకు చెందినది.	1.49	1,28,23,313	12,82,331	1,50,000
10	11	సర్వే నెం.313/1, 314/2, నిడుబ్రోలు (పొన్నూరు), గుంటూరు జిల్లాలోని ఎక 3.28 సెంట్ల ఖాళీ భూమి ఎన్. చిట్టెమ్మకు చెందినది.	3.28	91,68,750	9,16,875	1,50,000
11	12	డోర్ నెం.9-1-12, వార్డు నెం.11, నిడుబ్రోలు పొన్నూరు, గుంటూరు జిల్లా లోని ఎక 0.25సెంట్ల నివాస ఆస్తి ఎన్.చిట్టెమ్మ & ఎన్ అన్నారావుకు చెందినది.	0.25	1,21,50,000	12,15,000	1,50,000
		మొత్తం		12,43,43,213		

గమనికలు:
1) ఎలాంటి వారంటీలు మరియు నష్టపరిహారం అందించకుండానే విక్రయం నిర్వహించబడుతోంది.
2) అమ్మకం అనునది "ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే' ప్రాతిపదికన మరియు "రికోర్స్ రికోర్స్" ఆధారంగా నిర్వహించబడుతుంది.
3) బ్యాంక్రప్ట్ ఆస్తులు, ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారమ్, డిక్లరేషన్ మరియు అండర్‌టేకింగ్, ఆన్‌లైన్ వేలం విక్రయానికి సంబంధించిన సాధారణ నియమ & నిబంధనల గురించి పూర్తి మరియు వివరణాత్మక సమాచారం "ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రం"లో అందుబాటులో ఉన్నాయి. విక్రయ ప్రకటన తప్పనిసరిగా https://bankeauctions.com లో అందుబాటులోఉన్న "ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రం"తో పాటు చదవాలి లేదా ఇమెయిల్: btprismack @gmail.com లో సంప్రదించండి:
4) ఆసక్తిగల బిడ్డరుదారులు తప్పనిసరిగా "ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రం"లో సూచించిన విధంగా సంబంధిత నియమ & నిబంధనలను తప్పనిసరిగా చదివి, అంగీకరించిన తర్వాత పాల్గొనాలి.
5) ఈ ఆహ్వానం కాబోయే బిడ్డరుదారులు ఆహ్వానించడానికి ఉద్దేశించబడిందని మరియు విక్రయాన్ని అమలు చేయడానికి బ్యాంక్రప్టసీ ట్రస్టీ లేదా బ్యాంక్రప్టసీ పక్షాన ఎలాంటి బిడ్డింగ్ బాధ్యతలను సృష్టించదని స్పష్టం చేయబడింది. బ్యాంక్రప్టసీ ట్రస్టీకి ఏదైనా లేదా అన్ని ఆఫర్‌లను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఇ-వేలాన్ని వాయిదా వేయడానికి /మార్పుచేయడానికి /రద్దు చేయడానికి లేదా ఏ దశలోనూ ఎటువంటి కారణం చూపకుండా వేలం నుండి ఏదైనా ఆస్తులను ఉపసంహరించుకోవడానికి సంపూర్ణ హక్కు ఉంది.
6) ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 మరియు దాని క్రింద రూపొందించిన నిబంధనలకు లోబడి ఉంటుంది.
7) ఏవైనా స్పష్టీకరణల విషయంలో, దయచేసి దిగువ సంతకందారు వారిని సంప్రదించండి.

తేది: 30-09-2025
ప్రదేశం: హైదరాబాద్

మలిగి మధుసూదన రెడ్డి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
Regd No: IBBI/IPA-001/IP-P00843/2017-2018/11427

సంపాదకీయం

ఇంత నిర్లక్ష్యమా!

తమిళనాడు రాష్ట్రం కరూర్‌లో టివికె నాయకుడు, సినీ నటుడు విజయ్ సభలో చోటుచేసుకున్న మహా విషాదం మాటలకందనిది. నిర్వాహకుల భద్రతా లోపాలే తొక్కిసలాటగా మారి 41 మంది ప్రాణాలను బలిగొనడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. తీవ్రంగా గాయపడిన 80 మందిలో ఐదుగురి పరిస్థితి నేటికీ విషమంగానే ఉంది. ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారంతా అణగారిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారే. హీరో విజయ్ వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీకెండ్ రోడ్ షోలు ప్రారంభించారు. విజయ్‌ను చూసేందుకు అత్యధిక సంఖ్యలో సభలకు తరలివస్తున్నారు. వారికి తగిన భద్రత కల్పించడం, వారు ఇళ్లకు క్షేమంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయడం నిర్వాహకుల బాధ్యత. అలాంటి బాధ్యతలను గాలికొదిలేయడంతో తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తమ పార్టీపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారంటూ టివికె పార్టీ, తగిన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, ఆస్తుల విధ్వంసం చేస్తున్న వారిపై నిర్వాహకులకు నియంత్రణ ఉండటం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో నాలుగు రోజుల క్రితమే వాదనలు వినిపించాయి. ఆస్తినష్టం జరగకుండా ముందస్తుగా సభల నిర్వాహకుల నుంచి డిపాజిట్లు వసూలు చేయాలంటూ హైకోర్టు ఆదేశించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో మార్గదర్శకాలపై నివేదిక సమర్పించాలంటూ ధర్మాసనం ఆదేశించినా, సరైన జాగ్రత్తలు తీసుకోలేదనడానికి కరూర్ ఉదంతమే సాక్ష్యం. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు కరూర్ నగరంలోని వేలుసామిపురంలో సభ జరిపేందుకు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్న నిర్వాహకులు... మధ్యాహ్నం 12 గంటలకు, 12.30 గంటలకు సభ ప్రారంభమైపోతుందంటూ సోషల్ మీడియాలో ఊదరగొట్టారు. ఉదయం 9 గంటల నుంచే అక్కడికి చేరుకున్న అభిమానులు రాత్రి 7.30 గంటలకు విజయ్ వచ్చేవరకూ ఎండలో, కనీసం తాగునీళ్లిచ్చే దిక్కులేక, ఆహారం లేక అలమటించాల్సి వచ్చింది. విజయ్ కాన్వాయ్ సభా ప్రాంతంలోకి వచ్చేందుకు అభిమానులను చెదరగొట్టాల్సి వచ్చింది. 10 వేల మంది సభకు వస్తారని నిర్వాహకులు అనుమతి తీసుకుని, 30 వేల మందికిపైనే మూడు జిల్లాల నుంచి సమీకరించారు. విజయ్‌ను దగ్గర నుంచి చూడాలంటూ కొందరు అభిమానులు చెట్టు ఎక్కగా, ఆ చెట్టు కొమ్మ విరిగిపడటమే తొక్కిసలాటకు కారణమని చెబుతున్నారు. నీరసంగా ఉన్న అభిమానుల కోసం విజయ్ తన కాన్వాయ్ నుంచి నీళ్ల సీసాలు విసరడం, కొందరు అత్యుత్సాహంతో కాన్వాయ్ వద్దకు తోసుకెళ్లడమూ గందరగోళానికి కారణమైందంటున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు చేరుకోవడం, నిర్వాహకులు, స్థానిక అధికారుల మధ్య గందరగోళం, నిర్వహణాలోపమే ఘటనకు ప్రధాన కారణం. వెనువెంటనే సంఘటనా స్థలానికి సిఎం వచ్చి, పరామర్శించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం, మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అందించడం, నష్టపరిహారం ప్రకటించడం ఉపశమనం కలిగించేవే! రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. పరిహారం ప్రకటించిన విజయ్... బాధిత కుటుంబాలను పరామర్శించకుండా వెనుదిరగడమూ చర్చనీయాంశమైంది. ఆయన కానీ, వారి పార్టీ నాయకులు గానీ క్షతగాత్రులకు వైద్యమందించిన ఆసుపత్రులకైనా వెళ్లకపోవడం శోచనీయం. రాజకీయ సభలైనా, మతపరమైనవైనా, ఏ కార్యక్రమమైనా... అక్కడికి వచ్చే ప్రజల ప్రాణాలను కాపాడి, క్షేమంగా ఇళ్లకు చేర్చాల్సిన బాధ్యత నిర్వాహకులదీ, ప్రభుత్వాలదీ. ఇరుకుగా ఉండే ప్రదేశాలను జనాకర్షణ కలిగిన నేతల భారీ సభల కోసం, రోడ్‌షోల కోసం వినియోగించకుండా, విశాల ప్రదేశాల్లోనే సభలు నిర్వహించేలా చూడటం అవసరం. పదుల సంఖ్యలో అమాయక ప్రజల మరణానికి కారణమైన ఇటువంటి తొక్కిసలాట ఘటనల సందర్భంగా జరిగిన నిర్వహణ వైఫల్యాలు, పాలనా యంత్రాంగం లోపాలు వంటివి సమీక్షించి, తగు చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

సందర్భం



'బాలలు పెద్దవారై గొప్ప గొప్ప పనులు చేయాలి. వారు ధైర్యవంతులుగా, సాహస వీరులుగా తయారు కావాలి'. అని మాటలతో వారితో చెబుతుండడం కన్నా... వారే సాహసవంతమైన చిన్న చిన్న పనులు చేసేటట్టులు మనం ఎందుకు నేర్పకూడదు?
- గిజుభాయి, సుప్రసిద్ధ విద్యావేత్త.

ట్రంప్ సుంకాలు, జిఎస్టీ సర్దుబాట్లు

ప్రభాత్ పట్నాయక్

భారతదేశం మీద ట్రంప్ సాగిస్తున్న సుంకాల దాడి వలన మన ఆర్థిక వ్యవస్థ నిస్సందేహంగా వెనక్కి పోతుంది. ఒకవేళ ట్రంప్ ఇప్పుడు విధిస్తున్న 50 శాతం సుంకం రేటు తగ్గించినా, దానికి బదులుగా మన దేశం కూడా అమెరికన్ సరుకుల మీద, ముఖ్యంగా అక్కడి వ్యవసాయ ఉత్పత్తుల మీద, డెయిరీ ఉత్పత్తుల మీద సుంకాలు తగ్గించాల్సి వుంటుంది. అలా తగ్గిస్తే, ఆ సరుకుల దిగుమతులు బాగా పెరుగుతాయి. దాని ఫలితంగా మన దేశంలో రైతుల ఆదాయాలు తగ్గుతాయి. మన దేశ ఆర్థిక వ్యవస్థ ట్రంప్ సుంకాల వలన ఇలా ముడుచుకుపోకుండా ఉండాలంటే దేశీయ ఆర్థిక వ్యవస్థకి అదనపు కొనుగోలుశక్తిని కల్పించాల్సి వుంటుంది. ఈ పని జరగడానికి మూడు అవకాశాలు ఉన్నాయి. **మొదటిది:** ద్రవ్యలోటును పెంచడం. **రెండవది:** ధనవంతుల మీద అదనపు పన్నులు విధించి తద్వారా లభించే అదనపు ఆదాయాన్ని ప్రభుత్వం ఖర్చు చేయడం (అలా చేయడం వలన ధనవంతులవద్ద ఖర్చు కాకుండా ఉండిపోయిన ధనం ప్రభుత్వ వ్యయంగా మారుతుంది). **మూడవది:** వ్యక్తులకు రుణాలు అందించి వాటిని వాళ్ళు ఖర్చు చేసేవిధంగా ప్రోత్సహించడం (దీనివలన ప్రైవేటు వ్యక్తుల పొదుపు తగ్గి ఖర్చు పెరుగుతుంది).

ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన జిఎస్టీ రేట్లలో మార్పులు సెప్టెంబర్ 22 నుండి అమలులోకి వస్తున్నాయి. ఈ మార్పుల వల్లనే ఆర్థిక వ్యవస్థలోకి అదనపు కొనుగోలుశక్తి ఏమీ వచ్చి చేరదు. ఇప్పుడు చేసిన మార్పుల అనంతరం రెండే రేట్లు-5 శాతం, 18 శాతం అమలులో ఉంటాయి (కొన్ని "పాపపు సరుకులు' మాత్రం ఇప్పుడు 40 శాతం రేటు పరిధిలోకి వస్తాయి). గతంలో 5, 12, 18. 28 శాతం-ఇలా నాలుగు రకాల రేట్లు ఉండేవి. ఇప్పుడు చేసిన మార్పుల ఫలితంగా కల్పించిన రాయితీల ప్రయోజనాలు వినియోగదారులకు గనుక అందితే వారి మీద ఇప్పుడున్న భారం కొంత తగ్గుతుంది. కాని ఈ రేట్లు తగ్గింపు వలన ప్రభుత్వానికి వచ్చే రాబడి తగ్గుతుంది. అలా తగ్గిన మేరకు ప్రభుత్వం తన వ్యయాన్ని గనుక తగ్గించుకుంటే అప్పుడు మార్కెట్ లోకి అదనపు కొనుగోలు శక్తి నికరంగా ఏమీ వచ్చి చేరదు. అదే ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకోకుండా ద్రవ్యలోటును పెంచితే అప్పుడు అదనపు కొనుగోలుశక్తి కలుగుతుంది. ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకుంటే అప్పుడు జిఎస్టీ తగ్గింపు వలన పెరిగిన అదనపు కొనుగోలుశక్తి కాస్తా తగ్గిన ప్రభుత్వ వ్యయం కారణంగా హరించుకుపోతుంది. ట్రంప్ సుంకాల దాడి ఫలితంగా మన దేశ ఆర్థిక వ్యవస్థ స్థూల డిమాండ్ పడిపోవడాన్ని ఇలా జిఎస్టీ సుంకాల తగ్గింపుతో నివారించలేం.

ఇప్పుడు జిఎస్టీ తగ్గింపు వలన మొత్తంగా శ్రామిక ప్రజల వినిమయం పెరగబోతోందని ప్రభుత్వం చెప్పుకుంటోంది. అలా జరగడం కూడా ప్రశ్నార్థకమే. ఇప్పుడు ఇచ్చిన పన్ను రాయితీల వలన కొన్ని రకాల సరుకులకు మార్కెట్ పెరిగి ఆ సరుకులను ఉత్పత్తి చేసే పరిశ్రమల్లో కార్మికుల వేతనాలు కూడా ఆ మేరకు పెరగవచ్చు. కాని అదే సమయంలో ప్రభుత్వానికి ఇంతవరకూ వచ్చిన జిఎస్టీ ఆదాయం ఈ రాయితీల వలన తగ్గిన కారణంగా ప్రభుత్వం తన వ్యయాన్ని ఆ మేరకు తగ్గించుకుంటే ఏ యే రంగాల్లో ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకుంటుందో ఆ యా రంగాల్లో కార్మికుల వేతనాలు ఆ మేరకు తగ్గిపోతాయి. మొత్తంగా శ్రామిక ప్రజల కొనుగోలు శక్తిని కలిపి చూసినప్పుడు ఏ మార్పూ ఉండదు. ఇదేదో ఊహించి చెప్పేది కాదు. ప్రభుత్వం తన వ్యయాన్ని గనుక తగ్గించుకోవలసి వస్తే అది ప్రధానంగా మౌలిక వసతుల నిర్మాణ రంగంలో అమలు చేస్తుంది. ఈ నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు చాలా ఎక్కువ ఉంటాయి. మొత్తం వేతనాల్లో ఈ రంగపు కార్మికుల వేతనాల వాటా కూడా ఎక్కువగానే ఉంటుంది. అటువంటి రంగంలో ప్రభుత్వ వ్యయం తగ్గితే అప్పుడు ఆ రంగంలోని కార్మికుల వేతనాలు తగ్గిపోవడం కూడా ఎక్కువగానే ఉంటుంది.

చెప్పొచ్చేదేమంటే ట్రంప్ సుంకాల పెంపు వలన శ్రామిక ప్రజల ఆదాయాలు ఇక్కడ ఏ మేరకు తగ్గిపోతాయో ఆ మేరకు తగ్గే కొనుగోలుశక్తిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ఇక్కడ తీసుకుంటున్న చర్యలు సరిపోవు. ప్రభుత్వం ప్రకటించిన జిఎస్టీ రాయితీలతోబాటు ద్రవ్యలోటును పెంచి ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించకుండా అదే స్థాయిలో కొనసాగించడమన్నా చేయాలి లేదా ధనవంతుల మీద అదనపు పన్నుల భారాన్ని మోపి ప్రభుత్వ ఆదాయంలో లోటు ఏర్పడకుండానైనా చూడాలి. ఈ రెండిట్లో ఏదో ఒకటి చేయనప్పుడు జిఎస్టీ రాయితీల వలన శ్రామిక ప్రజల వినిమయ స్థాయి ఏ విధంగానూ పెరగదు.



> **ట్రంప్ సుంకాల పెంపు వలన శ్రామిక ప్రజల ఆదాయాలు ఇక్కడ ఏ మేరకు తగ్గిపోతాయో ఆ మేరకు తగ్గే కొనుగోలుశక్తిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ఇక్కడ తీసుకుంటున్న చర్యలు సరిపోవు. ప్రభుత్వం ప్రకటించిన జిఎస్టీ రాయితీలతోబాటు ద్రవ్యలోటును పెంచి ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించకుండా అదే స్థాయిలో కొనసాగించడమన్నా చేయాలి లేదా ధనవంతుల మీద అదనపు పన్నుల భారాన్ని మోపి ప్రభుత్వ ఆదాయంలో లోటు ఏర్పడకుండానైనా చూడాలి. ఈ రెండిట్లో ఏదో ఒకటి చేయనప్పుడు జిఎస్టీ రాయితీల వలన శ్రామిక ప్రజల వినిమయ స్థాయి ఏ విధంగానూ పెరగదు.**

జిఎస్టీ రేట్ల సవరణ ఫలితంగా ప్రభుత్వం ఎంత ఆదాయాన్ని కోల్పోనుంది? ఈ విషయమై పత్రికలలో రకరకాల నివేదికలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా తన ఆదాయం ఒక ఏడాది కాలంలో రూ.48,000 కోట్ల మేరకు తగ్గవచ్చునని ప్రకటించింది. జిఎస్టీ రేట్ల తగ్గింపు వలన రూ.93,000 కోట్ల ఆదాయం తగ్గవచ్చునని...ఐతే, "పాపపు సరుకుల" మీద విధించిన 40 శాతం జిఎస్టీ వలన అదనంగా రూ.45,000 కోట్ల ఆదాయం రావచ్చునని, మొత్తంగా చూసినప్పుడు రూ.48,000 కోట్లు తగ్గుతుందని లెక్క వేసింది. ఇక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిఎస్టీ ఆదాయం ఒక పూర్తి ఏడాదిలో కేవలం రూ.3,700 కోట్లు మాత్రమే తగ్గనున్నట్టు అంచనా వేసింది. జిఎస్టీ రేట్లను తగ్గించినందువలన వినిమయం బాగా పెరుగుతుందని, అందువలన మొత్తం మీద చూసినప్పుడు రెవెన్యూలో నష్టం నామమాత్రంగానే ఉండవచ్చునని ఎస్‌బిఐ అంచనా వేసింది. వివిధ ప్రైవేటు సంస్థల, వ్యక్తుల అంచనాల ప్రకారం ప్రభుత్వం ఏడాదికి రూ.1.2 లక్షల కోట్ల నుండి రూ.1.5 లక్షల కోట్ల వరకు ఆదాయాన్ని కోల్పోనుంది. ఐతే ఈ అంచనాలకు ప్రాతిపదిక ఏమిటి అన్నది మాత్రం వాళ్ళెవ్వరూ వెల్లడించలేదు.

పన్ను రేటు తగ్గినందువలన వినిమయం బాగా పెరుగుతుందన్న వాదన నుంచి ఒక ప్రశ్న తలెత్తుతుంది. అలా పెరిగే వినిమయానికి సరిపడా అదనపు కొనుగోలుశక్తి ఏ విధంగా సమకూరుతుంది? అన్నదే ఆ ప్రశ్న. ఉదాహరణకు: పన్ను రాయితీ రూ.100 మేరకు ఇచ్చినప్పుడు వినిమయం కూడా రూ.100 వరకూ పెరుగుతుందని భావించవచ్చు. కాని రు.100 పన్ను రాయితీ ఫలితంగా వినిమయం రూ.200 వరకూ పెరుగుతుందని ఏ విధంగా భావించగలం? అదనంగా వినిమయం కోసం రూ.100 ఎక్కడినుంచి లభిస్తుంది? పన్ను రాయితీల ఫలితంగా తగ్గిన ధరల వలన వినియోగదారులు ఉత్సాహపడి అప్పు చేసో లేక పొదుపు చేసిన సొమ్మును బైటకి తెచ్చో ఖర్చు చేస్తారని వాదించవచ్చు. కాస్సేపు ఈ వాదనను అంగీకరిద్దాం. ఇలా అప్పులు చేసేవారిలో శ్రామికవర్గానికి చెందినవారు దాదాపు ఎవరూ ఉండరు. వాళ్ళకి రుణాలు ఇచ్చేందుకు ఎవరూ సిద్ధపడరు. ఇక వాళ్ళ దగ్గర దాచుకున్న పొదుపు సొమ్ము కూడా ఏమీ ఉండదు.

బహుశా మధ్యతరగతి నెల జీతగాళ్ళకు రుణాలు లభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సరుకుల ధరలు తగ్గినప్పుడు ఎక్కువగా కొనుగోలు చేయడానికి ఈ తరగతివారు ముందుకు రావచ్చు. కాని వీళ్ళు అదనంగా కొనుగోలు చేసినందువలన వినిమయంలో వచ్చే ఊపు తాత్కాలికమే. ఎందుకంటే వాళ్ళు తీసుకున్న రుణాల వాయిదాలను తిరిగి చెల్లించవలసి వస్తుంది. అప్పుడు వాళ్ళు తమ నెలవారీ వినిమయాన్ని తగ్గించుకోక తప్పదు. అందుచేత రుణాల మీద ఆధారపడి వినిమయంలో వచ్చే పెరుగుదల తాత్కాలికంగానే ఉంటుంది. అంతేగాక, ఆ తర్వాత వినిమయం తిరోగమన దిశలోకి మళ్ళీ తగ్గడం ప్రారంభిస్తుంది.

మొత్తం మీద చూసినప్పుడు ట్రంప్ సుంకాల దాడి ప్రభావం నుంచి మన ఆర్థిక వ్యవస్థను కాపాడడానికి మోడీ ప్రభుత్వం చేసినదేమీ లేదని తెలుతోంది. ట్రంప్ సుంకాల దాడి ఫలితంగా దెబ్బ తినిపోయే చిన్న ఉత్పత్తిదారులకు ఆర్థికంగా సబ్సిడీలు ఇచ్చి వారిని ఆదుకోవచ్చు. అందుకోసం కావలసిన అదనపు ధనాన్ని ధనవంతులమీద అదనపు పన్నులు వేయడం ద్వారా రాబట్టవచ్చు (సంపద పన్ను వగైరాలు). కాని మోడీ ప్రభుత్వం అటువంటి పని చేయడం లేదు. కేవలం జిఎస్టీ తగ్గించినందువల్లే ట్రంప్ సుంకాల తాకిడిని తట్టుకోవడం సాధ్యం కాదు. అటువంటి రాయితీలు వినియోగదారులకు అదనపు కొనుగోలుశక్తిని కల్పించలేవు.

ఐతే మోడీ ప్రభుత్వం బహుశా ఒక మార్గాన్ని అనుసరించవచ్చు. ఆ మార్గాన్ని అనుసరిస్తే పాలకవర్గాలన్నీ ఆమోదిస్తాయి కూడా. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ బాండ్లను అమ్మేసి, ప్రభుత్వ రంగ వాటాలను అమ్మేసి జిఎస్టీ ఆదాయపు లోటును భర్తీ చేసుకోవడమే ఆ మార్గం. నిజానికి ప్రభుత్వం ద్రవ్యలోటును పెంచినా లేక ప్రభుత్వ వాటాలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మినా బడ్జెట్‌కు సంబంధించి పర్యవసానం ఒకటే. కాని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వంటివి ద్రవ్యలోటును పెంచితే కన్నెర్ర చేస్తాయి. అదే ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ వాటాలను అమ్మితే ఆమోదిస్తాయి. ఎందుకంటే ప్రభుత్వ ఆస్తులు కార్పొరేట్ల పరం కావడమే అవి కోరుకుంటాయి. అందుచేత మోడీ ప్రభుత్వం అటు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అధినేతలను, ఇటు భారత బడా కార్పొరేట్ శక్తులను ఒకే సారి సంతృప్తిపరిచేందకు సన్నద్ధం ఔతుంది. దాని వలన ఆర్థిక వ్యవస్థ మీద పడే ట్రంప్ సుంకాల ప్రభావం నుండి తాత్కాలికంగా తప్పించుకోవచ్చునేమోగాని, పెట్టుబడి కేంద్రీకరణ, సంపద అసమానతలు మాత్రం మరింత వేగంగా పెరుగుతాయి.

(స్వేచ్ఛానుసరణ)

ఆధునిక సాంకేతికతతో భారీ రిగ్గింగ్

> **కర్ణాటక లోని అలంద్ శాసనసభా నియోజకవర్గంలో ఓటర్ల తొలగింపు, మహారాష్ట్ర లోని రాజురా శాసనసభా నియోజకవర్గంలో ఓట్ల చేర్పు ఏ ఒక్క వ్యక్తో చేసిన పని కాదు. ఆటోమేటిక్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఏదైనా కంపెనీ గానీ, కాల్ సెంటర్ గానీ ఈ అవకతవకలకు పాల్పడి ఉండొచ్చని తెలుస్తున్నది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఎంపిక చేసిన కేంద్రాలలోని ఓటర్ల జాబితాలో సీరియల్ నంబర్ 1 నుండి తొలగింపుకుగానీ చేర్పుకు గానీ అభ్యర్థనలు నమోదు చేశారు. ఇదంతా పక్కా ప్రణాళిక ద్వారా చేసిన వ్యవహారమే అనడానికి బలమైన ఆధారాలున్నాయి.**

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

కర్ణాటక, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలకు సంబంధించి వెలువడుతున్న ఆరోపణల తీరు చిత్రవిచిత్రంగా ఉంది.

ఈ వ్యవహారం కర్ణాటక లోని అలంద్ నియోజకవర్గంలో మొదలైంది. ఆన్‌లైన్‌లో ఫారం 7 ద్వారా ఓటర్ల తొలగింపును కోరుతూ 2022 డిసెంబర్‌లో 6018 అభ్యర్థనలు అందాయి. ఈ మొత్తం వ్యవహారం సందేహాస్పదంగా మారింది. ఎన్నికల సంఘం తనంతట తానుగా ఈ వాస్తవాలను వెల్లడించలేదు. మూడేళ్ల తర్వాత బట్టబయలైన ఈ వ్యవహారం గురించి పదే పదే ఆరోపణలు వస్తున్నా, ఆఖరుకు ఈ నెలలో మరోసారి సదరు ఆరోపణలను లేవనెత్తినా ఎన్నికల సంఘం తొలుత ఇవన్నీ నిరాధారమైనవని కొట్టి పడేసింది. ఆ తర్వాత కర్ణాటక ఎన్నికల సంఘం ముఖ్యాధికారి ఇందులో 24 మాత్రమే వాస్తవమైనవి, మిగిలిన 5,994 దరఖాస్తులు మోసపూరితమైనవని ప్రకటించాక కేంద్ర ఎన్నికల సంఘానికి జరిగిన తప్పు ఒప్పుకోక తప్పింది కాదు. బ్లాక్ స్థాయి అధికారుల ప్రాథమిక విచారణానంతరం ఈ విషయమై ఎన్నికల అధికారి కల్బుర్గి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు.

కర్ణాటక లోని అలంద్ శాసనసభా నియోజక వర్గంలో ఓటర్ల తొలగింపు, మహారాష్ట్ర లోని రాజురా శాసనసభా నియోజకవర్గంలో ఓట్ల చేర్పు ఏ ఒక్క వ్యక్తో చేసిన పని కాదు. ఆటోమేటిక్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఏదైనా కంపెనీ గానీ, కాల్ సెంటర్ గానీ ఈ అవకతవకలకు పాల్పడి ఉండొచ్చని తెలుస్తున్నది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఎంపిక చేసిన కేంద్రాలలోని ఓటర్ల జాబితాలో సీరియల్ నంబర్ 1 నుండి తొలగింపుకుగానీ చేర్పుకు గానీ అభ్యర్థనలు నమోదు చేశారు. ఇదంతా పక్కా ప్రణాళిక ద్వారా చేసిన వ్యవహారమే అనడానికి బలమైన ఆధారాలున్నాయి.

అలంద్‌లో ఇద్దరు దరఖాస్తుదారులు ఫారం 7 సమర్పిస్తూ ఓటర్ల జాబితా నుండి తమ పేర్లు తొలగించమని పెట్టుకున్న దరఖాస్తులను ఎన్నికల సంఘం తిరస్కరించింది. అంటే ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా కానీ రాజకీయ ప్రయోజనాలతోనే ఇందుకు ఒడిగట్టారని స్పష్టం అవుతున్నది. ఓట్ల తొలగింపుకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసిన దరఖాస్తులలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఫోన్ నంబర్లను పేర్కొన్నారు. ఇదంతా ఎంపిక చేసుకున్న పోలింగ్ కేంద్రాల లక్ష్యంగా మారుమూల ప్రాంతం నుండి నడిపించారని అర్థమవుతున్నది.

ఈ అక్రమాలకు పాల్పడిన వారి కోసం కర్ణాటక సిఐడి విచారణ చేపట్టింది. జనవరి 16న సిఐడి కర్ణాటక ముఖ్య ఎన్నికల అధికారికి ఒక లేఖ రాస్తూ 'మా విచారణలో ఎన్నికల ప్రధానాధికారి ఈ దరఖాస్తులు నమోదు చేసిన ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐ.పి) లాగ్ వివరాలు ఇచ్చింది కానీ ఐ.పి గమ్యస్థానం వివరాలు గానీ, పోర్టు గమ్యస్థానం వివరాలు గానీ ఇవ్వలేదు. కాబట్టి ఆ వివరాలు అందించాల్సింది'గా కోరింది. ఓటర్ల జాబితాలో అక్రమాలకు ప్రయత్నించిన వారి ఉనికి, ఆవాస ప్రాంతం కనుక్కోవడానికి ఈ వివరాలు చాలా అవసరం.

ఎన్నికల సంఘం ఈ వివరాలు అందచెయ్యని పక్షంలో అలంద్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడిన పెద్ద తలకాయ (అది వ్యక్తి కావచ్చు, సంస్థ కావచ్చు, ఏ కాల్ సెంటరో కావచ్చు) ఎవరనేది బట్టబయలు చెయ్యలేరు.

కర్ణాటక సిఐడి 18 నెలలలో 18 అభ్యర్థనలు పంపినా ఎన్నికల సంఘం ఇప్పటి వరకు ఆ వివరాలు ఇవ్వలేదు. తొలుత కేవలం ఆరోపణలనుకున్నవి అక్రమాలేనని స్పష్టం అవుతున్నది. ఇదంతా ఒక పథకం ప్రకారం చేపట్టిన చర్యే అని కూడా స్పష్టం అవుతున్నది.

కర్ణాటక ఎన్నికల సంఘం ప్రధానాధికారి వివరణను అనుసరించి అలంద్ లోని 10 పోలింగ్ కేంద్రాలలో ఓట్ల తొలగింపుకు పెట్టుకున్న దరఖాస్తులలో 5,994 ఫోర్జరీవే అని తెలియ వస్తుంది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి ఈ మోసాన్ని గురించి బ్లాక్ స్థాయి అధికారులను హెచ్చరించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయించారు.

ఈ మొత్తం వ్యవహారం అనేక ప్రశ్నలను రేకెత్తిస్తున్నది: ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ ద్వారా ఫారం 7 సమర్పించి ఓటు తొలగించమని వచ్చే అభ్యర్థనలను బ్లాక్ స్థాయి అధికారులు పర్యవేక్షించే ప్రక్రియ ఎలాంటి లోటుపాట్లు లేకుండా జరుగుతుందా లేదా? మన దేశ ప్రజాస్వామ్యాన్ని ఇంత పచ్చిగా నీరుగార్చేందుకు ప్రయత్నించడం ద్వారా ఎవరికి లబ్ధి చేకూరనున్నది? ఓటర్ల జాబితాలో అవకతవకలు చేయడానికిగాను వ్యక్తులు, కంపెనీలు ఆటోమాటిక్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నాయా? అవకతవకలు జరిగాయనేందుకు ప్రాథమికంగా విశ్వసనీయమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం మొదటి నుండీ ఈ ఆరోపణలను ఎందుకు తోసిపుచ్చుతూ వచ్చింది? ఇది దేశవ్యాప్తంగా జరుగుతున్నదా? ఓటర్ల జాబితాలో అక్రమాల గురించి ఒకటొకటిగా అనేక ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో వీటిని అరికట్టే సామర్థ్యాన్ని సంతరించుకోవాలనే ఆలోచన ఎన్నికల సంఘానికి ఉన్నట్లా? లేనట్లా? ఎన్నికలలో సమ న్యాయం దక్కడం లేదన్న ఆందోళన నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో పౌరులను విశ్వాసంలోకి తీసుకుని ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘానికి ఉన్నదా? లేదా?

అత్యున్నత స్థాయి జుడిషియల్ కమిషన్‌ను నియమించడం ద్వారా స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించడం కానీ, అన్ని రాజకీయపక్షాల ప్రతినిధులు, ఎన్నికల రంగ నిపుణులతో కూడిన కమిటీతో పారదర్శకంగా విచారణ జరిపించడానికి కాని ఎన్నికల సంఘం సిద్ధపడాలి. స్వయం ప్రతిపత్తిగల సంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం విశ్వసనీయత నేలబారుకు చేరింది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి రాజ్యాంగం లోని 324, 326 అధికరణాల స్ఫూర్తితో సమ్మిళిత, సార్వజనీన ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

/ సెప్టెంబర్ 24 'పీపుల్స్ డెమోక్రసీ' /

సందర్భం

వృద్ధాప్యం కారాదు శాపం

మానవ జీవితంలో చివరి మజిలీ వృద్ధాప్యం. అలాగే జీవిత చక్రంలో బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం అనేవి సహజంగా చేరుకోవాల్సినవి.

మానవులు ప్రతి దశలోనూ ఆనందంగా గడపాలని అభిలషిస్తారు. పుట్టి, పెరిగి, బాధ్యతలు మోస్తూ చివరి దశకు చేరుకుంటారు. వారసులకు ఓ బాట చూపించి మనవళ్ళ, మనవరాళ్లతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేయాల్సిన దశ వృద్ధాప్యం. కానీ 60 ఏళ్ళ దాటినవారిని సీనియర్ సిటిజన్లనే ముద్ర వేసి వారిని పట్టించుకోవడంలేదు. మనం ఎంతో విలువైన అనుభవసారాన్ని కోల్పోతున్నాము. అయితే చాలా దేశాల్లో వృద్ధుల నుంచి ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నారు. జీవితంలో వారు గడించిన అనుభవాలను సేకరించి వారివారి రంగాలకు మెరుగులు దిద్దుకుంటున్నారు.

ప్రపంచంలో వృద్ధ జనాభా ఎక్కువగా ఉన్న దేశాలలో చైనా, భారత్ (ఆసియా), క్రొయేషియా, గ్రీస్, ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్ (దక్షిణ ఐరోపా) ఉన్నాయి. యూరప్ దేశాలలో 65 ఏళ్ల పైబడిన ప్రజలు 21 శాతం వున్నారు. మొనాకో వంటి దేశాలలో ఆయుర్దాయం అత్యధికంగా వుంది. ఇక్కడి ప్రజలు సగటున 87 సంవత్సరాలు జీవిస్తారు. అదే విధంగా స్వీడన్, నార్వే దేశాలు వృద్ధులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తాయి. ప్రతీ వృద్ధుని దగ్గర తాను పని చేసిన రంగంలో విశేషమైన అనుభవ జ్ఞానం ఉంటుంది. వారి అనుభవాలను ఉపయోగించుకునేందుకు సరైన ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

అక్టోబర్ 1 ప్రపంచ వృద్ధుల దినోత్సవం

మన రెండు తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు కోటి మందికిపైగా 60 సంవత్సరాలకు పైబడిన వారున్నట్లు అంచనా. సాధారణంగా 60 ఏళ్ళ పైబడిన వారికి రోగాలు మొదలవుతుంటాయి. దీర్ఘకాలిక రోగాల బారినపడి ఖరీదైన వైద్యం చేయించలేక ఎంతోమంది శేష జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్నారు. ఇక మా బతుకులింతే అని నిరాశా నిస్పృహలతో భారంగా గడుపుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ప్రతి మండల కేంద్రంలో వృద్ధులకు ఉచిత వైద్య సహకారం అందించాలి. ప్రతి బ్యాంకులో క్యూతో నిమిత్తం లేకుండా సీనియర్ సిటిజన్లకు లావాదేవీలు జరిపే సదుపాయం కల్పించాలి. 'ప్రభుత్వ కార్యాలయాలన్నిట్లోనూ వృద్ధులను గౌరవించడం మన బాధ్యత' అనే బోర్డులను ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వంలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఒక మంత్రిని నియమించాలి. సీనియర్ సిటిజన్లు ఎదర్కొంటున్న సామాజిక బాధలు పరిష్కరించడానికి ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలి. అనారోగ్యంతో బాధపడే వృద్ధులకు ఉచిత వైద్య సహాయం అందచేయాలి. ఈ పండుటాకులు అవస్థలు పడకుండా, అలమటించి పోకుండా చూసే బాధ్యత యువతకు, ప్రభుత్వానికి వుంది.

- యం.రాం ప్రదీప్, సెల్ : 9492712836

కేంద్రంతో ఎలాంటి చర్చలుండవ్

- వాంగ్‌చుక్‌ను బేషరతుగా విడుదల చేయాలి
- లడఖ్‌లో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేలా దృష్టిపెట్టాలి : లెహ్ అపెక్స్ బాడీ డిమాండ్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లేహ్ అపెక్స్ బాడీ సభ్యులు

లేహ్: లడఖ్‌లో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించే వరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హై పవర్డ్ కమిటీతో చర్చలకు దూరంగా ఉంటామని లేహ్ అపెక్స్ బాడీ సోమవారం ప్రకటించింది. "లడఖ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, లడఖ్‌లో శాంతి పునరుద్ధరించే వరకు, ఎటువంటి చర్చలలో పాల్గొనబోమని ఏకగ్రీవంగా అంగీకరించాం" అని లేహ్ అపెక్స్ బాడీ చైర్మెన్ తుప్‌స్టాన్ చెవాంగ్ తెలిపారు. నిర్బంధించిన పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, ఇతరులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ) సోమవారం డిమాండ్ చేసింది. లడఖ్‌కు రాష్ట్ర హోదా, ఇతర ప్రధాన డిమాండ్లను నెరవేర్చడంలో కేంద్రం విఫలమవడమే కాదు.. హిమాలయ ప్రాంత ప్రజలను టార్గెట్ చేయటాన్ని మోడీ ప్రభుత్వం మానుకోవాలని హెచ్చరించింది. ప్రధాని మోడీ "ప్రజాస్వామ్యం భారతీయుల డిఎన్‌ఎలో ఉందని మాట్లాడుతున్నప్పుడు.. లడఖ్ ప్రజాస్వామ్యాన్ని డిమాండ్ చేయడంలో తప్పు ఏమిటి?" అని ప్రజాసంఘాలు నిలదీస్తున్నాయి. లేహ్ హింస వెనుక ఎవరున్నారు.. వాస్తవాలపై నిష్పాక్షిక న్యాయ విచారణ జరపాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లడఖ్ రాజధాని లేహ్‌లో ఎటుచూసినా ఆంక్షల నీడల్లో ప్రజల్ని కట్టడి చేయాలనుకోవటం తగదని పేర్కొన్నాయి.

లేహ్ హింస వెనుక ఎవరున్నారు.. వాస్తవాలపై నిష్పాక్షిక న్యాయ విచారణ జరపాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లడఖ్ ప్రజల దృష్టి మరల్చడంతోపాటు విధాన చర్చల నుంచి వారిని దూరంగా ఉంచడానికి అధికారులు పండుగలను ఉపయోగిస్తున్నారని స్థానిక ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. లడఖ్‌లో గిరిజన గుర్తింపును కాపాడుకోవటంతోపాటు ప్రజాస్వామ్య హక్కులకోసం ఎంతకైనా పోరాడదామని స్పష్టం చేశాయి.

లడఖ్‌లో ప్రభుత్వ వైఫల్యం : తరిగామి

శ్రీనగర్ : లడఖ్‌లో పరిస్థితిని చక్కదిద్దడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం నాయకులు, ఎమ్మెల్యే ఎంవై తరిగామి విమర్శించారు. లడఖ్‌లో జరిగిన పరిణామాలను దురదృష్టకరమైనవిగా ఆయన పేర్కొంటూ ఆంక్షలు, అరెస్టులు వంటి ప్రభుత్వ చర్యలు సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. '2019 ఆగస్ట్ 5వ తేదీన ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని తీసుకురావడంతో కథ మొదలైంది. లడఖ్, జమ్ముకాశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితికి ఆ చట్టమే కారణం. పునర్వ్యవస్థీకరణ పేరుతో జరిగిన ఆటంకం కారణంగా మా భవిష్యత్తును కలసికట్టుగా నిర్ణయించుకోలేక పోతున్నాము. మా వ్యవహారాలను చక్కదిద్దుకోలేక పోతున్నాము' అని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు.

'భారతదేశ గొప్పదనం ప్రభుత్వంలో కానీ, సైన్యంలో కానీ ఉండదు. అది భిన్నత్వంలో ఏకత్వంలోనే ఉంటుంది. వేర్వేరు భాషలు, మతాలు, సంస్కృతులు కలిగిన మన సమూహాలు కలిసికట్టుగా జీవించాలని నిర్ణయించుకున్నాయి. అయితే ప్రభుత్వం రాష్ట్రానికి మాత్రమే కాకుండా యావత్ దేశానికీ నష్టం కలిగించింది' అని తరిగామి చెప్పారు. లడఖ్ ప్రజలకు అపారమైన భూ సంపద ఉన్నదని, అయితే తక్కువ జనాభా, పరిమిత వనరులు ఉండడంతో వారు గుర్తింపును కోరుకుంటున్నారని తెలిపారు. లాభాల కోసం కన్నేసిన బడా కార్పొరేట్ పెట్టుబడిదారుల నుంచి తమ భూములను కాపాడుకోవాలని వారు భావిస్తున్నారని అన్నారు. పునర్వ్యవస్థీకరణ బిల్లు జమ్మూ కాశ్మీర్‌కు శాసనసభను ఇచ్చిందని, అయితే లడఖ్‌కు అలాంటిది ఏదీ లేదని పేర్కొన్నారు. జమ్ము, కాశ్మీర్, లడఖ్ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తమ భాగస్వామ్యం ఉండాలని లడఖ్ ప్రజలు కోరుకుంటూనే ఉన్నారని తరిగామి చెప్పారు.

నా భర్తతో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు

- వాంగ్‌చుక్ సతీమణి అంగ్మో

న్యూఢిల్లీ : మూడు రోజుల క్రితం జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయిన పర్యావరణ కార్యకర్త, లేహ్ ఉద్యమ నాయకుడు సోనమ్ వాంగ్‌చుక్‌తో తాను ఇంకా మాట్లాడలేదని ఆయన భార్య గీతాంజలి జె. అంగ్మో చెప్పారు. 'ఆయన్ని తీసుకెళ్లి మూడు రోజులు గడిచాయి. ఆ సమయంలో నేను హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ లడఖ్‌లో ఉన్నాను. ఆయన్ని జోధ్‌పూర్ తీసుకెళ్లారని నాకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. జోధ్‌పూర్ చేరగానే నాతో మాట్లాడిస్తానని ఇన్‌స్పెక్టర్ హామీ ఇచ్చారు. కానీ నాకు ఇంకా ఫోన్ కాల్ రాలేదు' అని ఆమె తెలిపారు. జోధ్‌పూర్ జైలులోని ఒంటరి సెల్‌లో వాంగ్‌చుక్‌ను ఉంచారని, ఆయన నిరంతరం సిసి టీవీల పర్యవేక్షణలో ఉన్నారని వార్తలు వస్తున్నాయి.

జైలులో వాంగ్‌చుక్ ఏ స్థితిలో ఉన్నారో తెలియడం లేదని అంగ్మో వాపోయారు. సత్యాగ్రహం చేసినా, పాదయాత్ర చేసినా ఆయన శాంతియుతంగానే ఆందోళనలు నిర్వహించారని తెలిపారు. వాంగ్‌చుక్‌ను ఎక్కడో జోధ్‌పూర్ జైలులో ఉంచే బదులు ఢిల్లీలోనే ఉంచవచ్చునని అన్నారు. ఆయన్ని దేశ వ్యతిరేకిగా చిత్రీకరించి, ఎన్‌ఎస్‌ఎ ప్రయోగించారని ఆరోపించారు. వచ్చే నెలలో లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికలు జరగాల్సి ఉన్నదని, అందుకే వాంగ్‌చుక్‌ను అరెస్ట్ చేసి ఉండవచ్చునని చెప్పారు. తామిద్దరం విద్యా సంబంధమైన పనులపై గతంలో జోధ్‌పూర్‌కు రెండు సార్లు వెళ్లామని గుర్తు చేస్తూ ప్రజల గొంతుకగా నిలిచినందుకు భారత్ వ్యతిరేకిగా ముద్ర వేసి అక్కడ నిర్బంధిస్తారని వాంగ్‌చుక్ ఊహించి ఉండరని అంగ్మో అన్నారు.

బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన కెనడా

ఒట్టావా : లారెన్స్ బిష్ణోయ్ ముఠాను కెనడా ప్రభుత్వం సోమవారం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఈ ముఠా కెనడాలో హత్యలకు, అనేక బెదిరింపులకు పాల్పడిందని ఫెడరల్ ప్రజా భద్రతా మంత్రి గ్యారీ ఆనందసంగరీ మీడియాకు తెలిపారు..వీరిని ఉగ్రవాద జాబితాలోకి చేర్చడంతో నేరాలను కట్టడిచేయవచ్చునని, వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వానికి వీలుపడుతుందని ఆయన తెలిపారు. భారతదేశానికి చెందిన 32 ఏళ్ల లారెన్స్ బిష్ణోయ్‌పై అనేక నేరారోపణలున్నాయి. 2014వ సంవత్సరం నుండి జైలులో ఉన్న బిష్ణోయ్ అక్కడినుండే తన ముఠాను నడిపిస్తున్నాడు. పంజాబ్, హర్యానాలతో పాటు కెనడాలోని డయాస్పోరా కమ్యూనిటీలున్న ప్రాంతాల్లో ఈ ముఠా నేరాలు చేస్తుంది. అయితే పంజాబ్ సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య, కృష్ణ జింకల వేట విషయంలో పదే పదే షారూక్ ఖాన్‌ను బెదిరించిన విషయం తెలిసిందే.. కెనడాలో ఫైర్ బాంబింగ్, కాల్పులు ఘటనల్లో ఈ ముఠా ప్రమేయం ఉందని, ప్రముఖుల నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు ఆక్రమ రవాణా చేస్తుందని ఆర్‌సిఎంపి అసిస్టెంట్ కమిషనర్ బ్రిగిట్టే గౌవిన్ తెలిపారు. ప్రతిపక్షాలు, కెనడియన్ ప్రావిన్స్‌ల ఒత్తిడితో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కెనడా మీడియా తెలిపింది.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

- కలెక్టర్‌కు రైతు సంఘం ప్రతినిధి బృందం వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నకిలీ మొక్కజొన్న విత్తనాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం చెల్లించాలని, నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందం సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలాల్లోని నందికొట్కూరు, కొణిదెల, నాగటూరు, బిజినివేముల, తర్తూరు, బన్నూరు తదితర గ్రామాలలో నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50,000 నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయస్థానం, నరసరావుపేట.
I.A. No; 773/25 M.V.O.P. 34/25

బిట్వీన్ :
సామల రజని అండ్ అదర్స్ .... పిటీషనర్స్
అండ్
కోనేటి వీరకుమార్ అండ్ అదర్స్ .... రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ 1 : కోనేటి వీరకుమార్ (డ్రైవర్), తండ్రి : ఓబయ్య, వయస్సు 35 సం॥లు, డోర్ నెం. 61-21-10, అయ్యప్పస్వామి బజార్, రామలింగేశ్వర నగర్, విజయవాడ టౌన్ అండ్ మండలం, కృష్ణాజిల్లా.
రెస్పాండెంట్ 2 : రేనాటి కృష్ణారావు, తండ్రి : వెంకట సుబ్బయ్య, డోర్ నెం. 8-1/46, ప్లాట్ నెం.404, కళ్యం ధర్మక్షేత్ర అపార్ట్‌మెంట్, పిడుగురాళ్ళ టౌన్ అండ్ మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు ఓ.పి. నందు శ్రీయుత కోర్టువారి ద్వారా రెస్పాండెంట్ 1 మరియు 2 కు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినచో తీసుకోని కారణంగా శ్రీయుత కోర్టువారు ఈ పేపరు పబ్లికేషన్స్ ద్వారా మీకు తెలియ పరచటమైనది. వాయిదాతేది : 23-10-2025 అయివున్నది. ఈ వాయిదారోజున మీరు గానీ, మీ తరపు వకీలు ద్వారా గానీ శ్రీయుత కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో మీకు పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియపరచటమైనది.

శ్రీయుత కోర్టువారి ఉత్తర్వులతో
వాయిదాతేది : 23-10-2025

పి.చక్రపాణి, బి.కాం., ఎల్ఎల్.బి.,
అడ్వకేట్,
నరసరావుపేట. సెల్ : 9885644203

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

పోర్ట్ బ్లెయిర్ : అండమాన్ అండ్ నికోబార్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీహార్ తరహా ఎస్ఐఆర్‌ను సిపిఎం రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు కేంద్ర పాలిత ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ)కు లేఖను అందజేసింది. రాజకీయ పార్టీలతో సిఇఒ తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలోనూ ఎస్ఐఆర్ ద్వారా ఎదురయ్యే ఇబ్బందులను సిపిఎం ప్రముఖంగా ప్రస్తావించింది. ప్రతిపాదిత బీహార్ తరహా ఎస్ఐఆర్ చాలా క్లిష్టమైన ప్రక్రియ అని, ఇది పౌరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపింది. 1987 తరువాత జన్మించిన వారు తమ, తల్లిదండ్రుల పుట్టిన తేదీ పత్రాలను అందించడంలో ఇబ్బంది ఎదుర్కొంటారని, పైగా ఎస్ఐఆర్‌కు ఒక నెల మాత్రం సమయం ఇవ్వడం వలన ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు పత్రాలను అందజేయడంలో ఇబ్బందులు పడతారని తెలిపింది. సిపిఎం అభిప్రాయాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలని ఈ లేఖలో సిఇఒను కోరింది.

అమెరికాలోని చర్చిలో కాల్పుల కలకలం

- నలుగురు మృతి .. మరో ఎనిమిది మందికి గాయాలు

వాషింగ్టన్: అమెరికాలో ఆదివారం కాల్పులు కలకలం సృష్టించాయి. మిషిగన్‌లోని ఓ చర్చిలో దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. మిషిగన్ రాష్ట్రంలోని గ్రాండ్ బ్లాంక్‌లోగల మోర్మాన్ చర్చిని కారుతో ఢీకొట్టిన ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం నిప్పుపెట్టాడు. చర్చి మంటల్లో చిక్కుకుపోవడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ఆ సమయంలో చర్చిలో వందల మంది ఉన్నారు. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. ఎనిమిదిమంది గాయపడ్డారని, నిందితుడు హతమయ్యాడని పోలీసులు చెప్పారు.

నిందితుడిని థామస్ జాకబ్ స్యాన్‌ఫోర్డ్ (40)గా గుర్తించామని, అతడు గతంలో యుఎస్ మెరైన్‌లో పనిచేశాడని తెలిపారు. ఈ ఘటనలో ఎంతమంది గాయపడ్డారనే విషయమై పోలీసులు స్పష్టత నివ్వడం లేదు. ఈ ఘటనను అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. దేశంలోని క్రిస్టియన్లను లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఇలాంటి హింసాత్మక ఘటనలు వెంటనే ఆగిపోవాలన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని, వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తున్నట్టు తెలిపారు.

కాల్పుల విరమణపై చర్చిస్తున్నాం : నెతన్యాహూ

వాషింగ్టన్ : గాజాలో కాల్పుల విరమణకు సంబంధించిన తాజా ప్రణాళికపై అమెరికా అధ్యక్ష భవనంతో చర్చిస్తున్నామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సోమవారం సమావేశం కావడానికి ముందు నెతన్యాహూ ఈ వ్యాఖ్య చేశారు. గాజాలో యుద్ధాన్ని ముగించి, హమాస్ వద్ద బందీలుగా మిగిలి ఉన్న వారిని విడుదల చేయించేందుకు ట్రంప్ ఓ ప్రణాళికను రూపొందించిన విషయం తెలిసిందే. దీనికి అంగీకరించేలా ఆయన నెతన్యాహూపై ఒత్తిడి పెంచుతున్నారు. జనవరిలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నెతన్యాహూ వాషింగ్టన్‌లో పర్యటించడం ఇది నాలుగోసారి.

గాజాలో యుద్ధానికి స్వస్తి చెప్పాలంటూ నెతన్యాహూపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ప్రధానంగా గాజా నగరంలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని అనేక దేశాలు నిరసిస్తున్నాయి. ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇప్పటికే 60 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కాగా ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికలో 21 అంశాలు ఉన్నాయని అరబ్ అధికారులు తెలిపారు. తక్షణమే కాల్పుల విరమణ పాటించడం, హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని 48 గంటల్లో విడుదల చేయడం, గాజా నుంచి ఇజ్రాయిల్ దళాలు క్రమేపీ వైదొలగడం ఈ ప్రణాళికలోని ముఖ్యాంశాలు.

కుల వివక్షకు వ్యతిరేకంగా పాఠాలను చేర్చండి

- ఎన్‌సిఇఆర్‌టికి అలహాబాద్ హైకోర్టు ఆదేశం

అలహాబాద్ : కుల వివక్షకు వ్యతిరేకంగా పాఠశాల పుస్తకాల్లో పాఠాలను చేర్చాలని జాతీయ పాఠ్యపుస్తకాల తయారీ సంస్థ ఎన్‌సిఇఆర్‌టిని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 16న జస్టిస్ వినోద్ దివాకర్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వుల్లో కులం, సామాజిక అసమానతలపై విద్యార్థులకు సున్నితంగా బోధించే పాఠ్య పుస్తకాల కంటెంట్ అవసరాన్ని ప్రస్తావించింది. ఈ ఉత్తర్వుల వివరాల్లోకి వెళితే..హర్యానా నుంచి ఉత్తరప్రదేశ్ మీదుగా బీహార్‌కు మద్యం అక్రమ రవాణా కేసులో క్రిమినల్ చర్యలను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు విచారిస్తోంది. ఈ కేసులో నిందితుల కులాలను ప్రస్తావిస్తూ ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారు.

కులాన్ని ప్రస్తావించకుండా ఉండాలని హైకోర్టు పోలీసుల్ని ఆదేశించింది. కుల ఆధారిత అసమానతలను అధిగమించడానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించింది. 'కుల వివక్షతకు సంబంధించిన బహిరంగ చర్యలనే చట్టం శిక్షించగలదు. కానీ సంస్థలు, పాఠశాలలు, కార్యాలయాలు, గ్రామాల్లో ఇప్పటికీ ప్రబలంగా ఉన్న సూక్ష్మమైన వివక్షలను పరిష్కరించడానికి చట్టం పెద్దగా ఉపయోగపడదు. పరిశుభ్రత, లింగ సమానత్వం వంటి అంశాల మాదిరిగా కుల వివక్షపై దేశవ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం లేదు' అని హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. 'పాఠశాల సిలబస్‌లో కూడా కులవివక్షకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా అంకితమైన పాఠ్య ప్రణాళిక లేదు. కుల వివక్షను అంతంచేయడానికి ప్రభుత్వ చట్టాలతోపాటు స్థిరమైన కార్యక్రమాలు అవసరం. సామాజిక సామరస్యం, కుల సమానత్వాన్ని ప్రోత్సహించే జాతీయ ప్రచారం అవసరం. పాఠశాల విద్యార్థులకు సమానత్వం, గౌరవం, కుల పక్షపాతం వలన కలిగే ప్రమాదాల గురించి బోధించాలి' అని హైకోర్టు తెలిపింది.

దాదాపు అన్ని తరగతులకు ఎన్‌సిఇఆర్‌టి నూతన పాఠ్యపుస్తకాలను సిద్ధం చేస్తున్న సమయంలో హైకోర్టు ఆదేశాలు రావడం విశేషం. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను పలువురు విద్యావేత్తలు సమర్థిస్తున్నారు. ఢిల్లీ యూనివర్శిటీ పరిధిలోని ఒక కళాశాల అధ్యాపకుడు, ఫోరం ఆఫ్ అకడమిక్స్ ఫర్ సోషల్ జస్టిస్ చైర్మన్ హన్సరాజ్ సుమన్ మాట్లాడుతూ ఎన్‌సిఇఆర్‌టి ఇప్పటికే కుల వ్యవస్థకు వ్యతిరేకంగా తగినన్ని విషయాలను చేర్చి ఉండాల్సి ఉందని అన్నారు. కులాన్ని సమర్థించే బదులుగా అంబేద్కర్, జ్యోతిబా పూలే, పెరియార్‌ల జీవితం, వారసత్వం, వారి పోరాటాల గురించి మెటీరియల్ ఇవ్వాలని అన్నారు. అంబేద్కర్ పాఠశాల జీవితంలో కుల వివక్షను ఎలా ఎదుర్కొన్నారో విద్యార్థులు తెలుసుకోవాలని చెప్పారు.

ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా వచ్చారు

- ఎఫ్ఐఆర్‌లో విజయ్‌పై అభియోగాలు
- 41కి పెరిగిన మృతులు

తిరుచ్చి : కరూర్‌లో శనివారం జరిగిన ర్యాలీకి టివికె వ్యవస్థాపకుడు, హీరో విజయ్ ఉద్దేశపూర్వకంగానే ఆలస్యంగా వచ్చారని ఎఫ్ఐఆర్‌లో అభియోగాలు మోపారు. శనివారం కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఆ పట్టణ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ర్యాలీ నిర్వాహకులు ఉద్దేశపూర్వకంగా ప్లాన్ చేసి విజయ్ రాకను ఆలస్యం చేశారని ఎఫ్ఐఆర్ ఆరోపించింది. నీరు, ఇతర సౌకర్యాలు లేకుండా ప్రజలు గంటల తరబడి వేచి ఉన్నారని, ఉక్కబోత, రద్దీ కారణంగా అలసిపోయారని, దీని ఫలితంగా తొక్కిసలాట జరిగి అనేక మంది మరణించారని ఎఫ్ఐఆర్ పేర్కొంది. కరూర్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.మణివన్నన్ సుమోటోగా ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. టివికె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సిటిఆర్ నిర్మల్ కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి మతిమఝుగన్‌లను నిందితులుగా పేర్కొంది. ఎఫ్ఐఆర్ ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కరూర్‌కు విజయ్ వస్తారనే సమాచారంతో ఉదయం 10 గంటల నుంచే ప్రజలు భారీ సంఖ్యలో గుమిగూడారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ కోసం 500 మంది పోలీసులు, హోమ్‌గార్డులను నియమించారు. విజయ్ సమావేశానికి పోలీసులు మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ.. నిర్వాహకులు ఉద్దేశపూర్వకంగా ప్రణాళిక వేసుకుని, తమ రాజకీయ బలాన్ని ప్రదర్శించే ఉద్దేశంతో విజయ్ రాకను నాలుగు గంటలు ఆలస్యం చేశారని ఎఫ్ఐఆర్ తెలిపింది. పోలీసు అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా నిర్వాహకులు పట్టించుకోలేదని ఎఫ్ఐఆర్ ఆరోపించింది.

41కి చేరిన మరణాలు

కరూర్ తొక్కిసలాట మృతుల సంఖ్య సోమవారం నాటికి 41కి పెరిగింది. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన 60 ఏళ్ల మహిళ సుగుణ కరూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజి ఇంటెన్సివ్ యూనిట్‌లో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మరణించారు. దీంతో మరణించిన మహిళల సంఖ్య 18కి పెరిగింది. మరో తొమ్మిదిమంది చిన్నారులు, 14 మంది పురుషులు మరణించిన సంగతి తెలిసిందే.

రసవత్తరంగా న్యూయార్క్ మేయర్ ఎన్నికలు...

- పోటీ నుండి తప్పుకున్న ప్రస్తుత మేయర్ ఆడమ్స్
- రేసులో దూసుకుపోతున్న సోషలిస్టు మమ్దాని

న్యూయార్క్ : న్యూయార్క్ మేయర్ ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. సిటీ మేయర్ ఎరిక్ ఆడమ్స్ ఆదివారం ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. ఆయన విడుదల చేసిన వీడియోలో అవినీతి కేసులు, ప్రచార నిధుల నిలిపివేత వంటి పలు విషయాలను ప్రస్తావించారు. అవినీతి ఆరోపణల కారణంగా ప్రజలు తనను నమ్మడంలేదని ఎట్టకేలకు ఒప్పుకున్నారు. అయితే ఆ ఆరోపణలు తప్పని చెప్పుకొచ్చారు. మరోవైపు సోషలిస్టు, 33 ఏళ్ల జొహ్రాన్ మమ్దాని ప్రచారంలో దూసుకుపోతున్నారు. గత వారంలో సఫోల్క్ యూనివర్శిటీ నిర్వహించిన సర్వేలో మమ్దానికి 45% ఓటర్లు అనుకూలంగా ఉన్నారని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోకు 25% మంది ఓటర్లు మాత్రమే అనుకూలంగా ఉన్నారని ప్రకటించింది. అయితే ఆడమ్స్ నిర్ణయం తనకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదని, ఈ ఎన్నికలు ఆడమ్స్, క్యూమోల విఫల రాజకీయాలకు, ప్రజలకు మధ్య పోటీ అని మమ్దాని తెలిపారు. ఎన్ని కుట్రలు చేసినా ట్రంప్, ఆయన సహచర కోటీశ్వరులు ఈ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయలేరని, న్యూయార్క్ నగరంలో సమస్యలను పరిష్కరించడానికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించి ప్రచారం చేస్తున్నానని ఆయన స్పష్టంచేశారు. మరోవైపు క్యూమో కూడా తన ప్రచార వేగాన్ని పెంచారు. ఆడమ్స్ నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు. నగరం మంచికోసం తీసుకున్న నిస్వార్థ నిర్ణయమన్నారు. కానీ మమ్దానీ గెలిస్తే న్యూయార్క్‌కు ప్రమాదమని హెచ్చరించారు. ఇప్పుడు మా ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ అని చెప్పారు. అయితే ప్రస్తుత మేయర్ ఆడమ్స్ పదవీకాలం జనవరితో ముగుస్తుంది. నవంబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్షుడు ట్రంప్ పదేపదే మమ్దానిని విమర్శించిన సంగతి తెలిసిందే. అయితే మమ్దానికి నల్లజాతీయుల నుండి, ఆసియా ఓటర్లనుండి బలమైన మద్దతు ఉంది. సోషలిస్టు అనుకూల ప్రచారంతో, ఉద్యోగాలు, అద్దెలు, ఆర్థిక సమస్యల పరిష్కారం వంటి విషయాలతో యువ ఓటర్లను సైతం అకట్టుకోవడం ప్రత్యర్థుల శిబిరంలో కలకలం రేపుతుందని, న్యూయార్క్ వాసులు మమ్దానివైపే మొగ్గుచూపే అవకాశం కనిపిస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రికార్డు సృష్టించింది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ఏర్పాటు చేశారు. ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు లయబద్ధంగా ఆడారు. మంత్రి సీతక్క బతుకమ్మపాట పాడి అలరించారు.

MANAPPURAM HOME FINANCE LTD.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్: U65923K12010PIC039179 యూనిట్ నం.301-315, 3వ అంతస్తు, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై-400093.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** ("యంఎహెచ్ఓఎఫ్ఐయన్") అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (యాక్ట్), 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీతలను మరియు సహ-రుణగ్రహీతలను పిలుస్తు నోటీసులో పేర్కొన్న మొత్తం సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా మొత్తాన్ని చెల్లించవలసిందిగా **డిమాండ్ నోటీసు** జారీచేయబడింది. రుణగ్రహీత మొత్తాన్ని చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్ లోని రూల్ 9 తో చదువుతూ సదరు చట్టం లోని సెక్షన్ 13 (4) క్రింద అతను/ఆమెకి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారుడు ఇందులో దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా **స్వాధీనం** చేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమైనది. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని జరిపే ఏవేని లావాదేవీలు మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు లోబడి ఉంటాయని తెలియపరుచుచున్నాము.

క్ర సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/ లోన్ ఖాతా నంబరు/శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు పంపిన తేది మరియు మొత్తం బకాయి
1	చందోలు రామ వెంకట శిరీష, నాగదేశి విజయబాబు, నాగదేశి కిరణ్ కుమార్/ MHL00310012871/ విజయవాడ	కృష్ణా జిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రీ, గన్నవరం మండలం, కేసరపల్లి గ్రామ పంచాయితీ ప్రాంతం, కేసరపల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం.242/10, డోర్ నెం.6-126, అసిస్ట్ నెం.830, నివాస స్థలం యొక్క దక్షిణ వైపున 84.7 చ.గ.ల విస్తీర్ణంలోని ఏసిసి షీట్ షెడ్, పి.ఓ.కేసరపల్లి, కృష్ణ, ఆంధ్ర ప్రదేశ్, పిన్: 521102. తూర్పు: 2గజాలు వెడల్పు ఉమ్మడి మార్గం, పడమర: నాగదేశి విజయ బాబు ఆస్తి, దక్షిణం: సింగవరపు సుధా రాణి ఆస్తి, ఉత్తరం: చీలిజోజి ఆస్తి	25-09-2025	21-06-2025 & Rs.6,69,178/-

తేది:30-09-2025, ప్రదేశం:కృష్ణా
సం/- అధీకృత అధికారి-మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి ఎప్పుడు?

- కేంద్రం తీరును నిరసిస్తూ పంజాబ్ అసెంబ్లీ తీర్మానం

చండీగఢ్ : ఎన్నడూ లేనంత వరద నష్టంతో బాధపడుతున్న పంజాబ్‌కు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఆ రాష్ట్ర అసెంబ్లీ ఖండించింది. ఈ మేరకు సోమవారం ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ పదేపదే సమావేశం కోసం విజ్ఞప్తి చేస్తున్నా ప్రధానమంత్రి కార్యాలయం స్పందించకపోవడాన్ని తీర్మానం ఖండించింది. కేంద్రం తన చర్యల ద్వారా రాష్ట్ర ప్రజలను అవమానించిందని, పూర్తిస్థాయిలో సంభవించిన విపత్తు పరిహారం రాష్ట్రం అందుకోకుండా కేంద్రం అడ్డుకుంటోందని విమర్శించింది. పంజాబ్‌లో వరద బాధితులకు పునరావాసంపై చర్చ పూర్తయిన తరువాత ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానం ఆమోదించిన సమయంలో బిజెపికి చెందిన ఇద్దరు సభ్యులు సభలో లేరు. రెండు రోజుల ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఈ నెల 26న ప్రారంభమైంది. సోమవారం చర్చలో ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ మాట్లాడుతూ ఇటీవల వరదల్లో 75 శాతం నుంచి 100 శాతం దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.20 వేలు, 33 శాతం నుంచి 75 శాతం దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. పూర్తిగా దెబ్బతిన్న ఒక్కొక్క ఇంటికి రూ 1.20 లక్షలు పరిహారం ఇస్తామని తెలిపారు. వరదల తరువాత పేరుకుపోయిన ఇసుకను పొలాల నుంచి తీయడానికి రైతులకు ఎకరానికి రూ.7,200 ఇస్తామని చెప్పారు. దీపావళికి ముందే ఈ పరిహారం అందించడం ప్రారంభిస్తామని చెప్పారు. వరదల నష్టం గురించి వివరించడానికి ప్రధానమంత్రి మోడీ తనకు సమయం ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి విమర్శించారు. రాష్ట్ర గవర్నర్‌కు మోడీ సమయం ఇచ్చారని తెలిపారు. ఈ నెల 30న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ ఇచ్చారని ముఖ్యమంత్రి వెల్లడించారు. సోమవారం తీర్మానం ప్రకారం 1988 తరువాత పంజాబ్‌లో ఇవి అత్యంత దారుణమైన వరదలు, 34 లక్షల మంది ప్రజలు ఈ వరదలతో ప్రభావితమయ్యారు. పంజాబ్ ఎదుర్కొన్న అత్యంత దారుణమైన వరదల స్థాయికి అనుగుణంగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని మంజూరు చేయడంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్పందన లేకపోవడాన్ని, వైఫల్యాన్ని ఈ సభ ఖండిస్తుందని తీర్మానం తెలిపింది.

ఇబి-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రాం ఫీజుకు శ్వేతసౌధం అనుమతి

వాషింగ్టన్ : నవీకరించిన ఇబి-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రాం ఫీజుకు శ్వేతసౌధానికి చెందిన ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ ఆమోదం తెలిపింది. అధికారిక విడుదలకు ముందు దీనిని చివరి చర్యగా చెప్పవచ్చు. ఇబి -5 ఇన్వెస్టర్ వీసా ఫీజు నియంత్రణలకు శ్వేతసౌధం సమీక్షలో ఆమోదం లభించిందని ఇమ్మిగ్రేషన్ రిపోర్టర్ ఆండ్రూ క్రెగ్‌బామ్ తెలిపారు. ఇబి -5 ఇమ్మిగ్రేషన్ ప్రోగ్రాం ద్వారా అమెరికా గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేయాలంటే విదేశీ మదుపుదారులు ఫారం ఐ-526ను ఉపయోగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దీని ఫీజు 11,160 డాలర్లు. దీనికితోడు ఇబి-5 ఇన్వెస్టర్ వీసాకు అయ్యే మొత్తం ఖర్చు దరఖాస్తు చేసే ప్రదేశాన్ని బట్టి 21,130-22,225 డాలర్ల మధ్య ఉంటుంది. అమెరికా గ్రీన్ కార్డ్‌ను త్వరితగతిన పొందడానికి ఇబి-5 వీసా ప్రోగ్రాం దారి చూపుతుంది. గ్రీన్ కార్డు కలిగి ఉన్న వారు అమెరికా పౌరసత్వాన్ని పొందుతారు. అయితే ఇబి -5 వీసా పొందాలంటే విదేశీయులు భారీగానే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారం నెం.VI (ఎ)

Ref: B1/111/2025 — **ది.29-09-2025**

(2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19), సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాధమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, పి.అంకంపాలెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వరరామచంద్రపురం మండలం, రామవరం మరియు రామవరంపాడు గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పున:స్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు శ్రీ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ మరియు ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్, చింతూరు యూనిట్, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పున:స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10-05-2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం. 42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాధమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలక్టరు /ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు — మండలం: జీలుగుమిల్లి — గ్రామం: పి.అంకంపాలెం

వరుస సంఖ్య	సర్వే నెంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు (తండ్రి /భర్త పేరు)	హద్దులు				చెట్లు నిర్మాణాలు మొదలైనవి ఏవైనా ఉంటే వాటి వివరాలు
						తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	
1	2	3	4	5	6	7	8	9	10	11
1	4-1A	జి.డి.	0.74	0.74	చిల్లపల్లి సీతమ్మ	12,14, 16	3	5, 11	RF	జీడిమామిడి తోట, ఊడిగ-1, వేప-2
2	4-1B	జి.డి.	0.93	0.93	దాసరి రామలక్ష్మి	12,14, 16	3	5, 11	RF	జీడిమామిడి తోట, వేప-2, మద్ది-2,సుబాబుల్-1,తాడి-1
3	4-2C	జి.డి.	0.75	0.75	పల్లెల దుర్గమ్మ	12,14, 16	3	5, 11	RF	జామాయిల్, వేప-5, జీడి-3
4	4-1D	జి.డి.	0.59	0.59	మన్యం మహాలక్ష్మి	12,14, 16	3	5, 11	RF	జామాయిల్, వేప-1, తాడి చెట్లు-20
5	4-1E	జి.డి.	0.71	0.71	నూతి పుష్పావతి	12,14, 16	3	5, 11	RF	జామాయిల్, వేప-2, తాడి-21
6	4-1A1	జి.డి.	0.92	0.92	వీరంకి పుష్పావతి	12,14, 16	3	5, 11	RF	జీడి
7	43	జి.డి.	8.98	8.98	చంపాటి శాంతి	39	44	57	42	పామాయిల్ తోట, బోర్లు-2, పైప్ లైన్ మరియు డ్రిప్
8	34-6D	జి.డి.	1.00	1.00	బత్తిన లక్ష్మీదుర్గ	85	32	పుంత	పి.నారాయణ పురం గ్రామం	వరి, తాటి చెట్లు-4
9	34-6E	జి.డి.	1.00	1.00	నంగెండ్ల నాగయ్య	85	32	పుంత	పి.నారాయణ పురం గ్రామం	ఖాళీభూమి, సీతాఫలం-1,ముష్టిచెట్లు-2 వేప-6,ఆరె-1,జామాయిల్-1,తాటి-1
10	34-6F	జి.డి.	1.70	1.70	నంగెండ్ల బాలాజీ	85	32	పుంత	పి.నారాయణ పురం గ్రామం	వరి, జాడు,కొబ్బరి-40,టేకు-6,ముష్టి-1 బత్రింక-1,జామ-1,సిందుగా-1, మామిడి-2, వేప-1, మునగ-1
11	34-6G	జి.డి.	1.69	1.69	నంగెండ్ల రాటాలు	85	32	పుంత	పి.నారాయణ పురం గ్రామం	వరి, జాడు,ఆరిగా-1,ముష్టి-1,నెమలి-3 చింత-1,కొబ్బరి-46,మామిడి-8, సీతాఫలం-3,టేకు-2,సిందుగా-3, బత్తాయి-2,నారింజ-3,నేరేడు-1, రేగు-1,తాడి-40,వేప-1,ఊడిగ-3
12	34-6	జి.డి.	1.00	1.00	నంగెండ్ల రత్తమ్మ	85	32	పుంత	పి.నారాయణ పురం గ్రామం	ఖాళీ భూమి, చింత-2, ఊడిగ-1, నెమలి-2,వేప-5,ఆరె-1
13	4-1F	జి.డి.	1.68	1.68	రొక్కం సుబ్బారావు	12,14,16	3	5, 11	RF	జీడిమామిడి, వేప-11
14	4-1J	జి.డి.	1.77	1.77	పసల సుబ్బారావు	12,14,16	3	5, 11	RF	ఖాళీభూమి,తాటి-2,వేప-2
15	66-1	జి.డి.	0.62	0.62	యన్నంశెట్టి విజయలక్ష్మి	64	72	65	67	పామాయిల్ తోట
16	66-1A	జి.డి.	1.90	1.90	యన్నంశెట్టి విజయలక్ష్మి	64	72	65	67	
17	68-1	జి.డి.	0.05	0.05	యన్నంశెట్టి విజయలక్ష్మి	67	69	67part	81	
18	4-1L	జి.డి.	2.67	2.67	పేరం చందర్‌రావు	12,14,16	3	5, 11	RF	జీడితోట,మామిడి-50,వేప-7
19	4-1K	జి.డి.	1.24	1.24	జక్కోజు వెంకటాచార్యులు	12,14,16	3	5, 11	RF	జీడితోట,తాటి-2, వేప-2
20	4-1K	జి.డి.	1.23	1.23	జక్కోజు వీరాచార్యులు	12,14,16	3	5, 11	RF	జీడి తోట
21	34-6	జి.డి.	1.00	1.00	ఈడ పుష్ప	77, 79	23	42, 41	25	జీడిమామిడి-43,వేప-9,ముష్టి-1 కుంకుడు-1,నేరేడు-1,సిందుగా-1 సీతాఫలం-2,తాటి-4, నెమలి-1
22	34-8B	జి.డి.	0.95	0.95	కాలింగ వెంకాయమ్మ	77, 79	23	42, 41	25	వరి, తాటి-12, నెమలి-2
23	34-8A	జి.డి.	0.26	0.26	దేశబోయిన దుర్గమ్మ	77, 79	23	42, 41	25	ఖాళీ భూమి
24	59	జి.డి.	3.34	3.34	పిల్లి సత్యనారాయణ	60	58	కామయ్య పాలెంగ్రామం	37	ఖాళీ భూమి
25	59	జి.డి.	3.34	3.34	పిల్లి ఏడుకొండలు	60	58	కామయ్య పాలెంగ్రామం	37	ఖాళీ భూమి
26	51-9B	జి.డి.	1.00	1.00	పేరం వెంకటలక్ష్మి	53	8	52	50	ఖాళీ స్థలం
27	83-2A	జి.డి.	0.19	0.19	తోట మహాలక్ష్మి	85	32	పుంత	పి.నారాయణ పురంగ్రామం	ఖాళీ స్థలం
28	32	జి.డి.	1.09	1.09	తోట మహాలక్ష్మి	84	31	33, రోడ్డు	పి.నారాయణ పురంగ్రామం	ఖాళీ స్థలం
29	31-6		1.25	1.25	తోట బాలరాజు	32	30	33, రోడ్డు	పి.నారాయణ పురంగ్రామం	తాడి-30, వరి
30	32-1	జి.డి.	1.22	1.22	తోట బాలరాజు	84	31	33, రోడ్డు	పి.నారాయణ పురంగ్రామం	
31	32-5					84	31	33, రోడ్డు	పి.నారాయణ పురంగ్రామం	వరి
32	37-2	జి.డి.				59	58	36	59	
33	83-2E	జి.డి.				85	32	పుంత	పి.నారాయణ పురంగ్రామం	
34	83-3E	జి.డి.	0.34	0.34	తోట బాలరాజు	85	32	పుంత	పి.నారాయణ పురంగ్రామం	ఖాళీ స్థలం
35	32	జి.డి.	0.34	0.34	తోట బాలరాజు	84	31	33, రోడ్డు	పి.నారాయణ పురంగ్రామం	ఖాళీ స్థలం
36	59-1A	జి.డి.	3.33	3.33	పల్లి శ్రీను	60	58	కామయ్య పాలెంరోడ్డు	37	ఖాళీ స్థలం
37	32-11	జి.డి.	1.66	1.66	నాలి రాఘవలు	84	31	33, రోడ్డు	పి.నారాయణ పురంగ్రామం	ఖాళీ స్థలం
38	49-1	జి.డి.	5.04	5.04	వద్దునిది భాను	54	48	50	47	ఖాళీ స్థలం
39	49-2	జి.డి.	2.38	2.38	వద్దునిది భాను	54	48	50	47	ఖాళీ స్థలం
40	8/6	జి.డి.	2.25	2.25	పల్లెల భాగారావు	52, 51	7	9	కామయ్య పాలెంగ్రామం	తాడి-8, వేప-2, బోర్-1
41	8/6	జి.డి.	0.50	0.50	బొల్లా యేసుకుమారి	52, 51	7	9	కామయ్య పాలెంగ్రామం	తాడి-4, వేప-1
			60.65	60.65						

సం/- **డి.చంద్రశేఖర్**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణాధికారి)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు

సం/- **యస్.సరళావందనం,** భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

జీవన సౌరభం

నిన్నటి గురించి బాధపడకుండా, రేపటి గురించి ఆలోచించ గలిగిన వ్యక్తికి విజయం అందినట్లే.

మీ కోసం

ములక్కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే వాటిని ఒకవైపు నీటిలో ముంచి వుంచాలి.

తీపి మిఠాయి

ఉధీర్ష్, ధ్రువ పాఠశాల నుంచి ఇంటికి వచ్చారు. వారు తినటానికి అమ్మ మిఠాయిలు ఇచ్చింది. ఇద్దరూ తింటూ పెరట్లోకి వెళ్లారు. ఇంతలో ధ్రువ చేతిలోని మిఠాయి జారి కింద పడింది. ఉధీర్ష్ తన దగ్గరున్న మిఠాయిలో కొంత ధ్రువకు ఇచ్చాడు. ఇంతలో కింద పడిన మిఠాయి వద్దకు చీమలు వచ్చాయి. పిల్లలిద్దరూ వాటిని గమనించసాగారు. అవి మిఠాయిని తరలించేందుకు అనువుగా చిన్నవిగా చేశాయి. ఆపై చీమలన్నీ మిఠాయిని పుట్టలోకి తరలించేందుకు సిద్ధమయ్యాయి.

ఇంతలో ఎక్కడి నుంచో గండు చీమలు వచ్చాయి. అవి చీమలను బెదిరించాయి. భయపడిపోయిన చిట్టిచీమలు నోటికాడి ఆహారాన్ని బాధగా వదిలేసి దూరం జరిగాయి. గండు చీమలు విజయగర్వంతో మిఠాయిని తరలించసాగాయి. కొద్దిదూరం పోగానే వాటికి తొండ కనపడింది. దానిని చూడగానే గండుచీమలు ప్రాణభయంతో మిఠాయిని వదిలి పరారయ్యాయి. తొండ దొరికిన మిఠాయిని నోరు తెరిచి తినబోతుండగా హఠాత్తుగా మ్యావ్ మంటూ పిల్లి వచ్చింది. పిల్లిని చూడగానే తొండ పరుగుతో చెట్టు మీదకు వేగంగా పాకి తప్పించుకుంది. మిఠాయి దక్కిందనే ఆనందంతో పిల్లి మీసాలు తిప్పుతూ తొండ వైపు గర్వంగా చూసింది. పిల్లి కూడా అప్పనంగా దొరికిన మిఠాయి రుచి చూసింది. తియ్యగా ఉండటంతో పట్టు పట్టాలనుకుంది.

ఇంతలో భౌ..భౌమంటూ కుక్క అరుపు వినపడింది. దానిని చూసిన పిల్లి వణుకుతూ మిఠాయి వదిలేసి పక్క ఇంట్లోకి దూరింది. కుక్క తనకు దక్కిన మిఠాయి తినాలని ప్రయత్నించింది. ఇంతలో పెరట్లోకి వచ్చిన అమ్మ, కుక్కను చూసి కర్ర తీసింది. దాంతో అది గోడ దూకి బయటకు పరుగుతీసింది. కుక్క వదిలేసిన మిఠాయిని చూసి చీమలు మళ్లీ దగ్గరకు వచ్చాయి. ఆనందంతో మిఠాయిని పుట్టలోకి తరలించాయి. మిఠాయి చివరికి చీమలకే దక్కినందుకు ఉధీర్ష్, ధ్రువ సంతోషంతో గంతులు వేశారు. ఏం జరిగిందో అర్థం కాని అమ్మకి, అసలు విషయం చెప్పారు. పిల్లలిద్దరి ఆనందానికి తోడు ఈసారి అమ్మ నవ్వులూ జత కలిశాయి.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర,
బీటెక్ సెకండియర్ (ఈసీఈ),
ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల,
ఖమ్మం.

నేను గీసిన బొమ్మ

పి.కావ్య
2వ తరగతి,
అక్షర విద్యాలయం,
పుట్రేల,
విస్సన్నపేట మండలం,
ఎన్టీఆర్ జిల్లా.



కొత్తపల్లి సందీప్,
6వ తరగతి,
శ్రీపాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్,
లక్ష్మీపురం,
గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వృద్ధాప్యం వేదన కాదు!

అక్టోబరు 1 వృద్ధుల దినోత్సవం

వృద్ధాప్యం అనగానే జీవితం అయిపోయిందనే నిరాశకు చాలా మంది గురవుతారు. అయితే వృద్ధాప్యం అనేది అనుభవ పాఠశాలల గని. అయితే పెరుగుతున్న వయసుతో పాటు తరుగుతున్న శారీరక ధారుడ్యం దానికి తోడు రకరకాల వ్యాధులు ఈ వయసులో చుట్టుముడతాయి. దీంతో ఆరోగ్యం క్షీణించి సహజంగానే మానసిక సమస్యలు ఎదురవుతాయి. నిజానికి పెరిగే వయస్సు కంటే కూడా తరిగే మానసిక స్థైర్యమే మానసిక సమతుల్యతను దెబ్బతీస్తుంది. శారీరక, మానసిక సమస్యల తీవ్రతను పెంచుతుంది. జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ వెళితే వృద్ధాప్య సమస్యలకి చెక్ పెట్టొచ్చు.

ఈ వయస్సులో మధుమేహం, బ్లడ్ ప్రెషర్, గుండెజబ్బులు, ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులకు తోడు దీర్ఘకాలిక వ్యాధులు కూడా కుంగదీస్తాయి. ఈ పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండాలంటే ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. అవకాశం మేరకు వ్యాయామం, వేళకు మందులు తీసుకోవాలి.

ఎమ్టీ నెస్ట్ సిండ్రోమ్ (Empty Nest Syndromes)

ఈ మధ్య కాలంలో విపరీతంగా పెద్దల్లో పెరుగుతున్న ఒక మానసిక వ్యాకులత ఇది. పిల్లలకి దూరంగా జీవిస్తున్న పెద్దవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. సాధ్యమైనంతవరకు ఇతర వ్యాపకాలు పెట్టుకుని మానసిక వ్యాకులతకి లోనవ్వకుండా చూసుకోవాలి.

సర్దుబాటులోనే సామరస్యత

వృద్ధాప్యంలో అతి ముఖ్యమైనది జీవిత భాగస్వాముల మధ్య సర్దుబాటు ధోరణి. మనస్పర్థలకు తావులేనివిధంగా జీవనయాత్ర సాగాలి. పిల్లల విషయంలో కూడా అత్యంత జాగరూకత చాలా ముఖ్యం. అనవసర సలహాలు కొన్ని సందర్భాలలో ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయవచ్చు. అడగని సలహాల అనర్థాన్ని గుర్తించి మెలగాలి.

కళ్ళ ముందర జరుగుతున్నకొన్ని వాస్తవాలు

ఈనాటి సామాజిక పరిస్థితులలో ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నత కూడా వృద్ధాప్యంలో ఎదుర్కోవాల్సిన సమస్యలకు ఒక సవాలుగా వుంది! కాలానుగుణంగా మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ మనోనిబ్బరం, మానసిక పరిణితులు పెంచుకుంటే వాస్తవాన్ని గ్రహించినవారవుతారు.

ఏం చేయాలంటే..

- సమయానుకూలంగా తీసుకోవాల్సిన మందులు సక్రమంగా తీసుకోవాలి. పోషక విలువలు కలిగిన ఆహారాలు సమతుల్యంగా తీసుకోవాలి.
- శరీరం సహకరించే మేరకు నడక, యోగా, గార్డెనింగ్ లాంటి వ్యాయామాలు ప్రతి రోజు తప్పనిసరిగా చేయాలి.
- దైనందిక వ్యాపకాలలో భాగంగా పుస్తక పఠనం, మానసిక ప్రశాంతత కలిగించే చక్కటి సంగీతం వినే అలవాట్లను పెంచుకోవాలి.
- నేర్వటానికి వయసు అడ్డు కాదనే విధంగా ఈ మధ్య వృద్ధాప్యంలో పైచదువులు చదివేవారు పెరుగుతున్నారు. ఈ పరిణామం చాలా మంచిది.
- విద్యావంతులు పెద్ద పెద్ద పదవుల నుండి రిటైర్ అయినవారు విలువలతో కూడిన తమ తమ అనుభవాలను వ్రాత రూపంలో లేదా ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా నేటి తరం కోసం అందించే ప్రయత్నాలు చేయడం ఉత్తమం.
- తమ తోటి వయస్కులలో అవసరమనిపించే వారికి అవకాశం మేరకు సహాయ సహకారాలు అందించాలి.
- ప్రసార మాధ్యమాల్లో లేదా సోషల్ మీడియాలలో ఉద్రేకాలను, ఉద్వేగాలను, భయాందోళనలకు గురి చేసే ప్రసారాలకు దూరంగా మెలగాలి.

సమస్యలను నేర్పుగా సంయమనంతో ఎదుర్కోవటం మన చేతుల్లోనే ఉంది. వృద్ధాప్యం అంటే జీవితం అయిపోవటం కాదు, నిజమైన జీవితం ఇక్కడ నుండే ప్రారంభమౌతుంది. 'వృద్ధాప్యం 0భారం కాదు భావి తరాలకు బాసట, వృద్ధాప్యం వేదన కాదు ముందు తరాలకు నివేదన!



- అమర్‌నాథ్ జగర్లపూడి,
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్
కార్పోరేట్ ట్రైనర్,
9849545257.

నెలసరిలో..

నెలసరి సమయంలో చిన్న చిన్న ఇబ్బందులు తప్పనిసరి. మానసిక సమస్యలే కాకుండా శారీరక సమస్యలు కూడా ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వాటిని అధిగమించవచ్చు.

చల్లని ఆహారం వద్దు : పీరియడ్స్ సమయంలో చల్లగా ఉండేవి కాకుండా కాస్త వేడిగా ఉండే సూప్స్, వేడి ఆహారం తీసుకోవడం వల్ల నొప్పులు తగ్గుతాయి. శరీర ఉష్ణోగ్రతలో మార్పు రావడం వల్ల రక్త ప్రసరణ వేగంపై ప్రభావం పడి నొప్పి తగ్గే అవకాశం ఉంటుంది.

వేడినీటి కాపడం : పీరియడ్స్ సమయంలో నొప్పిని భరించలేక చాలామంది పెయిన్ కిల్లర్స్ తీసుకుంటారు. కానీ అలా చేయకుండా వేడి నీటి బాటిల్‌తో కాపడం పెట్టుకున్నా సరిపోతుంది.

నువ్వుల నూనెతో : పీరియడ్స్ సమయంలో నొప్పి తగ్గించేందుకు నువ్వుల నూనె బాగా ఉపయోగపడుతుంది.

పాలకూర తినాలి : పీరియడ్స్ సమయంలో ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. విటమిన్ కె, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్ వంటివి ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి.

అల్లం: రుతుస్రావం సమయంలో తీసుకునే ఆహారంలో అల్లం ఉపయోగించడం వల్ల నొప్పిని తగ్గించడంతో పాటు పీఎంఎస్ లక్షణాలను కూడా కనిపించకుండా చేస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల కడుపుబ్బరం, నడుము నొప్పి, వాంతులు, కీళ్ల నొప్పులు వంటివి తగ్గడంతో పాటు అతి రక్తస్రావం ఉంటే ఆ సమస్య కూడా తగ్గుతుంది.

ఉపవాసం వేళ ఇవి తీసుకోవాలి..

నవరాత్రుల్లో ఉపవాసం చేసేవారు సరైన ఆహారం తీసుకోకుంటే.. అలసట, బలహీనత లాంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి ఈ సమయంలో మంచి ఆహారాన్ని తీసుకోవాలి.

బీట్‌రూట్ సలాడ్ : బీట్‌రూట్ సలాడ్ ఉపవాసం సమయంలో తేలికైన, పోషకమైన ఆహారం. బీట్‌రూట్‌లో దోసకాయ, క్యారెట్, ముల్లంగిని కూడా కలుపుకోవచ్చు. ఈ సలాడ్‌లో నిమ్మరసం పిండుకుంటే రుచితో పటు విటమిన్ సి కూడా లభిస్తుంది. బీట్‌రూట్‌లో ఫైబర్, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోజంతా శక్తిని ఇవ్వడానికి సహాయపడతాయి. ఇంకా ఈ సలాడ్‌లో కొన్ని వేయించిన పప్పులు లేదా మొలకలు జోడించడం వల్ల ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా లభిస్తాయి.

పెరుగు బంగాళాదుంప : ఉడికించిన బంగాళాదుంపలు, పెరుగుతో తయారుచేసిన ఈ వంటకం ఉపవాసానికి సరైనది. బంగాళాదుంపలు శక్తిని అందిస్తాయి, పెరుగు ప్రోటీన్ ప్రోబయోటిక్‌లను అందిస్తుంది. ఇవి జీర్ణక్రియకు సహాయపడతాయి. రాతి ఉప్పు, ఇంగువ జోడించడం వల్ల దాని రుచి పెరుగుతుంది.

సబుదాన పోహా : సబుదానలో నెయ్యి, వేరుశెనగలు, పచ్చిమిర్చి, రాతి ఉప్పు వేసి పోహా తయారుచేసుకోవచ్చు. ఇది తేలికగా, సులభంగా జీర్ణమవుతుంది. సబుదాన పోహా తిన్న తర్వాత చాలా సేపు ఆకలి వేయదు.

సబుదాన టిక్కీ : సాగో, బంగాళాదుంపలు, వేరుశెనగలతో తయారు చేసిన టిక్కీలు ఉపవాస సమయంలో రుచికరమైన ఆహారం. వీటిని తేలికగా వేయించవచ్చు. బయట క్రిస్పీగా, లోపల మృదువుగా ఉండే ఈ టిక్కీలు శక్తిని, పోషణను అందిస్తాయి.

తెలుగు సినీ, డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడిగా శోభారాజ్

ప్రధాన కార్యదర్శిగా వెల్లంకి శ్రీనివాస్

తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న తెలుగు సినీ, డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ (24 క్రాఫ్టులు) ఎన్నికలు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. యూనియన్ కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా 2025–2027 సంవత్సరాలకు గాను రెండేళ్లపాటు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులు భర్తీ కోసం ఈ ఎన్నికలు జరిగాయి. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓటింగ్ జరగ్గా, సాయంత్రం 4.30 గంటలకు ఫిలింనగర్‌లోని ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ హాలులో ఓట్ల లెక్కింపు జరిగింది. అధ్యక్ష పదవికోసం బి.విజయ్‌కుమార్, కె.శోభారాజ్ (టైగర్‌రాజు) పోటీపడ్డారు. మొత్తం 1312 ఓట్లకు గాను 629 పోలయ్యాయి. 16 ఓట్లు చెల్లుబాటు కాలేదు. శోభారాజ్‌కు 559, విజయ్‌కుమార్‌కు 54 ఓట్లు వచ్చాయి. శోభారాజ్ 505 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి పదవికి ధన్‌రాజ్. టి. (చిత్రపురి ధనరాజ్) (82), కె.వి.శివ (82), వెల్లంకి శ్రీనివాస్‌కుమార్ (446) పోటీపడ్డారు. 364 ఓట్ల మెజార్టీతో శ్రీనివాస్‌కుమార్ గెలుపొందారు. కోశాధికారి పదవికి జి.శివశంకర్ (పటేల్) (103), పి.నరసింహారెడ్డి (502)పోటీపడ్డారు. 399 ఓట్లతో నరసింహారెడ్డి గెలుపొందారు. ఎన్నికల ప్రధాన అధికారులుగా వల్లభనేని అనిల్‌కుమార్, అమ్మిరాజు కానుమిల్లి వ్యవహరించారు. ఈ సందర్భంగా కె.శోభారాజ్, వెల్లంకి శ్రీనివాస్‌కుమార్, పి.నరసింహారెడ్డి మాట్లాడుతూ నిరంతరం సినీ కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఇండస్ట్రీ పెద్దలు, ప్రభుత్వ ప్రతినిధులతో చర్చించి డిమాండ్ల సాధనకు కట్టుబడి ఉంటామని వివరించారు.

'శశివదనే' ట్రైలర్ విడుదల

'పలాస 1978' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించిన హీరో రక్షిత్ అట్లూరి నటిస్తున్న తాజా చిత్రం 'శశివదనే'. ఇందులో కోమలీ ప్రసాద్ కథానాయిక. ఇటీవల హిట్–3 సినిమాతో ఆమె నటించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న 'శశివదనే' చిత్రం నుంచి ట్రైలర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. ఇందులో ఆర్ఎక్స్ 100 రాంకీ, నటుడు రఘు కుంచె, కన్నడ నటుడు దీపక్ ప్రిన్స్ నటీనటులుగా, సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతోంది. అహితేజ బెల్లంకొండ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇది గోదావరి నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్, వింటేజ్ విలేజ్ లవ్‌స్టోరీగా తెరకెక్కిందని నిర్మాతలు తెలిపారు. అక్టోబర్ 10న ఈ చిత్రం విడుదల కానుంది.

'వెన్నెల..ఓ వెన్నెలా...'

'చల్లని వెన్నెల స్వర్ళకు మురిసిన కలువ రేకులు' అంటూ సాగే పాట చిత్రీకరణ విజయవాడలోని రాజీవ్‌గాంధీ పార్కు, మంగళగిరిలోని హ్యాపీ రిసార్ట్స్‌లో షూటింగ్ జరిగింది. వారాహి ఆర్ట్స్ అండ్ శక్తి క్రియేషన్స్ బ్యానర్‌పై 'కాకర్ల ఎంఆర్' కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'వెస్ట్రన్ లవ్'. కథానాయకుడిగా రావి రామ్‌చరణ్, కథానాయికగా మాహి నటిస్తున్నారు. విష్ణుశ్రీ, సత్యఈషా, పవన్, సుమన్, అశోక్‌కుమార్, రవిప్రకాష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ పిఎల్‌కె రెడ్డి. సంగీతం ప్రమోద్ పులిగిల్ల, ఎడిటర్‌గా నందమూరి హరి. రెండుపాటలు మినహా మిగతా షూటింగ్ మొత్తం పూర్తయ్యిందని నిర్మాతలు రావి సౌజన్య, కాకర్ల ఎంఆర్ తెలిపారు. ఇప్పటివరకూ పూర్తయిన షూటింగ్ తాలూకా ప్రీ ప్రొడక్షన్ వర్కు కూడా పూర్తయ్యిందని వివరించారు.

సుధీర్ కథానాయకుడిగా 'హైలెస్సో'

జబర్దస్త్ కామెడీ షో ఫేమ్‌గా పేరు తెచ్చుకున్న సుడిగాలి సుధీర్ ఆ తర్వాత కథానాయకుడిగా సినిమాలో ఎంట్రీ ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ సుధీర్, గాలోడు వంటి చిత్రాల్లోనూ నటించారు. తన కెరీర్‌లో వస్తోన్న ఐదో చిత్రానికి 'హైలెస్సో' అనే టైటిల్ ఖరారు చేశారు. టైటిల్‌తో పాటు పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ మూవీకి కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నటాషా సింగ్, నక్ష శరణ్ కథానాయికలు. ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు. ఈ నాలుగు భాషల్లోనూ రిలీజ్ చేసిన పోస్టర్లు ఆకట్టుకునేలా ఉన్నాయి. దసరా నవరాత్రి ఉత్సవాలకు విజయవాడ వచ్చిన ఆయన సందడి చేసిన విషయం తెలిసిందే.

టీమిండియాకు తొలి పరీక్ష

- నేడు శ్రీలంకతో అమీతుమీ
- మధ్యాహ్నం 3.00గం॥ల నుంచి
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

గౌహతి: 13వ ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ నేటినుంచి ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ బరిలో మొత్తం 8జట్లు పాల్గొంటున్నాయి. భారత్–శ్రీలంక జట్ల మధ్య మంగళవారం జరిగే తొలి లీగ్ 2025 ఐసిసి వన్డే మహిళల ప్రపంచకప్ టోర్నీ షురూ కానుంది. తొలిమ్యాచ్‌కు గౌహతి ఆతిథ్యమివ్వనుండగా.. పాకిస్తాన్ మహిళలజట్టు ఆడే మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోని కొలంబో స్టేడియంలోని ప్రేమదాస స్టేడియంలో జరగనున్నాయి. పాక్ జట్టు సెమీస్, ఫైనల్‌కు చేరిన పక్షంలో ఆ మ్యాచ్‌లు కూడా అక్కడే జరుగుతాయి. ఐసిసి ర్యాంకింగ్స్‌లో టాప్–8 జట్ల మధ్య ఈ మెగా టోర్నీ జరగనుండగా.. లీగ్ దశలో ప్రతి జట్టు ఏడు మ్యాచ్‌లు ఆడనుంది. లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత టాప్–4లో నిలిచిన జట్ల మధ్య అక్టోబర్ 29, 30న సెమీస్, నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

ఆస్ట్రేలియా మహిళలదే ఆధిపత్యం..

టైటిల్ ఫేవరెట్‌గా డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా మహిళలు బరిలోకి దిగుతున్నారు. ఆ జట్టు అత్యధికంగా ఏడుసార్లు ఈ టైటిల్‌ను చేజిక్కించుకోగా... సీనియర్, స్టార్ ప్లేయర్లంతా ఈసారి మెగా టోర్నీలో ఆడుతున్నారు. ఇంగ్లండ్ జట్టు 4సార్లు, న్యూజిలాండ్ జట్టు ఒకసారి ఈ టైటిల్‌ను గెలుచుకున్నాయి. టీమిండియా అత్యుత్తమ ప్రదర్శన 2005, 2022లలో రన్నరప్‌గా నిలువడమే. 2009లో 3వ స్థానంలో, 1997, 2000 టోర్నమెంట్‌లలో సెమీస్ వరకు చేరగల్గింది.

దుర్భేద్యఫామ్‌లో టీమిండియా..

టీమిండియా మహిళల జట్టు ఈసారి దుర్భేద్యఫామ్‌లో ఉంది. ఈ టోర్నీకి ముందు ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా ఓడినా.. ఆ జట్టుకు ముచ్చెమటలు పట్టించి అదరగొట్టే ప్రదర్శనతో ఆకట్టుకుంది. ముఖ్యంగా మూడో, చివరి వన్డేలో ఆస్ట్రేలియా మహిళలు నిర్దేశించిన 413పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఏకంగా 369పరుగులు చేసి ఆ జట్టుకు ముచ్చెమటలు పట్టించింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఏకంగా రెండు శతకాలు ఒక అర్ధసెంచరీతో రాణించి ఫామ్‌లోకి వచ్చింది. ఈ సిరీస్‌ను టీమిండియా 1–2తో చేజార్చుకున్నా.. మూడు వన్డేలోనూ ఆస్ట్రేలియా మహిళలకు గట్టిపోటీనిచ్చింది. దీంతో వన్డే ప్రపంచకప్‌లో టీమిండియాపై భారీ అంచనాలు పెరిగాయి.

భారత్ ఆడే మ్యాచ్‌ల షెడ్యూల్..

30(మంగళ)	ఇండియా మహిళలు × శ్రీలంక మహిళలు	(ఏసిఏ స్టేడియం, గౌహతి)
అక్టోబర్ 5(ఆది)	ఇండియా మహిళలు × పాకిస్తాన్ మహిళలు	(ప్రేమదాస స్టేడియం; కొలంబో)
09(గురు)	ఇండియా మహిళలు × దక్షిణాఫ్రికా మహిళలు	(ఏసిఏ–విడిసిఏ క్రికెట్ స్టేడియం; విశాఖ)
12(ఆది)	ఇండియా మహిళలు × ఆస్ట్రేలియా మహిళలు	(ఏసిఏ–విడిసిఏ క్రికెట్ స్టేడియం; విశాఖ)
19(ఆది)	ఇండియా మహిళలు × ఇంగ్లండ్ మహిళలు	(హోల్కర్ స్టేడియం; ఇండోర్)
23(మంగళ)	ఇండియా మహిళలు × న్యూజిలాండ్ మహిళలు	(డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ, నవీ ముంబయి)
26(ఆది)	ఇండియా మహిళలు × బంగ్లాదేశ్ మహిళలు	(డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ, నవీ ముంబయి)
29(బుధ)	సెమీఫైనల్–1	30(గురు) : సెమీఫైనల్–2
నవంబర్ 2(ఆది)	ఫైనల్	

ట్రోఫీ ప్రదానోత్సవం.. హై డ్రామా

- ఖాళీ చేతులతోనే టీమిండియా ఆటగాళ్ల సంబరాలు



ఆసియాకప్ ట్రోఫీ అందుకొనేందుకు నిరాకరిస్తున్న సూర్యకుమార్

దుబాయ్: ఆసియా కప్ టైటిల్ విజేతగా నిలిచిన టీమిండియా ఆటగాళ్లు.. ట్రోఫీని ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసిసి) అధ్యక్షులు, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా అందుకోవడానికి నిరాకరించారు. ఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత స్టేజ్ పైకి వచ్చి ట్రోఫీ అందుకోవాల్సిందిగా టీమిండియా ఆటగాళ్లను పిలువగా... కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నిరాకరించాడు. దీంతో స్టేజ్ పైన ఉన్న నఖ్వీతోపాటు ఇతర ఏసిసి సభ్యులందరూ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. దీంతో నఖ్వీ సీరియస్‌గా స్టేజ్ దిగి వెళ్లిపోగా.. టీమిండియా ఆటగాళ్లంతా ఖాళీ చేతులతోనే సంబరాలు చేసుకున్నారు. ఫొటో షూట్ అనంతరం ఆటగాళ్లంతాఅక్కడనుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బిసిసిఐ నజరానా..

ఆసియా కప్ 2025 టైటిల్‌ను సాధించిన టీమిండియా ఆటగాళ్లపై భారత క్రికెట్ బోర్డు(బిసిసిఐ) కనకవర్షం కురిపించింది. ఆటగాళ్లు, సహాయ సిబ్బంది, ఇతర సభ్యులందరికీ కలిపి రూ.21 కోట్ల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించింది.

ఫీజు మొత్తం ఇండియన్ ఆర్మీకి: సూర్యకుమార్ యాదవ్

టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆసియా కప్ టోర్నీలో తాను అందుకున్న మ్యాచ్ ఫీజును భారత సైన్యానికి, పహల్గామ్ ఉగ్రదాడి బాధితుల కుటుంబాలకు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. విజయం అనంతరం సూర్య కుమార్ యాదవ్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టాడు. 'ఈ టోర్నీ ద్వారా అందుకున్న ఫీజును సాయుధ దళాలకు, పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సాయం చేయడానికి దానం చేయాలని నిర్ణయించుకున్నా..' అంటూ రాసుకొచ్చాడు. ఏడు మ్యాచ్‌లకు గానూ సూర్య కుమార్ యాదవ్‌కు రూ.28లక్షలు అందుకున్నాడు.

గుంటూరు యువ షూటర్ ముఖేష్‌కు రజతం



న్యూఢిల్లీ: జూనియర్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీల్లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ రజత పతకంతో మెరిశాడు. సోమవారం 25మీ. ర్యాపిడ్ ఫైర్ ఫైనల్లో షూట్ ఆఫ్‌లో ఓటమిపాలయ్యాడు. షూట్ ఆఫ్‌లో ముఖేష్ 3–1 తేడాతో పరాజయాన్ని చవిచూశాడు. రష్యాకు చెందిన కోవలేవ్ బంగారు పతకం గెలుచుకోగా.. ముఖేష్‌కు రజత పతకం దక్కింది. న్యూట్రల్ అథ్లెట్‌గా ఈ వరల్డ్ కప్‌లో బరిలోకి దిగిన అలెగ్జాండర్ కొవలేవ్‌కు బంగారు పతకం లభించింది. ఇండియాకు చెందిన సూరజ్ శర్మ కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ముఖేష్ 571/600 పాయింట్ల స్కోర్‌తో మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. తొలి ఆరు స్థానాల్లో నిలిచిన షూటర్ల మధ్య జరిగిన ఫైనల్ ఉత్కంఠ భరతంగా సాగింది. ఆరో రౌండ్‌లో సూరజ్ శర్మకు కాంస్య పతకం ఖరారు కాగా... ఏడవ రౌండ్‌లో ముఖేష్, కోవలేవ్ ఇద్దరు 27 పాయింట్లతో సమంగా నిలిచారు. ఫలితం కోసం షూట్ ఆఫ్ నిర్వహించగా... ముఖేష్ పరాజయాన్ని చవిచూశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68